

తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 46 | 16.11.2026 నుంచి 22.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |





ఆ నగరాలకు.. ఎట్టకేలకు!

- పెండింగ్ లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఈ నెల 26న పోలింగు



అమరావతి: ఏపీలో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఈనెల 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంతో 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు కలిపి మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థల్లో రెండోదశ ఎన్నికలకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఏర్పాట్లు చేసింది.

ఎన్నికలు నిర్వహించనున్న స్థానిక సంస్థలివే..

నగరపాలక సంస్థలు: శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లి

పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు: ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా), రాజాం (విజయనగరం), పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు (పశ్చిమ గోదావరి), చింతలపూడి (ఏలూరు), గుడివాడ, తాడిగడప (కృష్ణా), పొన్నూరు (గుంటూరు), నరసరావుపేట (పల్నాడు), కందుకూరు (ప్రకాశం), పొదిలి (మార్కాపురం), కావలి, గూడూరు, అల్లూరు (నెల్లూరు), శ్రీకాళహస్తి (తిరుపతి), బి.కొత్తకోట (అన్నమయ్య), బాపట్ల.

ఆ సమ్మిట్ కేవలం పబ్లిసిటీ కోసమే



విశాఖపట్నం : విశాఖపట్నంలో నిర్వహించిన పార్టనర్‌షిప్ సమ్మిట్ కేవలం ప్రచారం కోసమేనని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. ఈ సమ్మిట్‌లో పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు ఎవరూ పాల్గొనలేదని, రాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు రాలేదని ఆరోపించారు. అంతేకాదు చంద్రబాబు వల్ల రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన జరగదని మరోసారి తేలిపోయిందన్నారు. గతంలో నిర్వహించిన సమ్మిట్‌లలో చేసుకున్న ఒప్పందాలకు, వాస్తవంగా ప్రారంభమైన పరిశ్రమలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన విమర్శించారు. ఇలాంటి ఈవెంట్లు నిర్వహించడం చంద్రబాబుకు అనవాయితీగా మారిందని, ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం చేసుకోవడం చంద్రబాబు, లోకేశ్‌లకు అలవాటేనని అన్నారు. గత రెండున్నరేళ్లలో చేసుకున్న ఒప్పందాలు, వాస్తవంగా ప్రారంభమైన పరిశ్రమల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయగలరా? 20 లక్షల ఉద్యోగాలు ఎవరికి కల్పించారో వివరాలు చెప్పగలరా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పోర్టులను కూడా చంద్రబాబు తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కోర్టులకు వెళ్లారని, అయినప్పటికీ జగన్ సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును ఒక కొలిక్కి తీసుకొచ్చారని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని కూడా జగన్ తీసుకొచ్చారని అన్నారు. విశాఖలో 3 వేల ఎకరాల భూమిని ఊరూపేరు లేని కంపెనీలకు చంద్రబాబు కట్టబెట్టారని ఆరోపించారు.



- టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ముందంజ..
- చంద్రబాబు దార్శనికతపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రశంసలు
- విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.12.14 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాల లక్ష్యం
- 141 అవగాహన ఒప్పందాలు.. 2.46 లక్షల మందికి ఉపాధి అంచనా


పెట్టుబడులకు ఏపీ చిరునామా!

విశాఖపట్నం: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుగానే ఆలోచించారని కొనియాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కల్పించడంలో చంద్రబాబు ప్రత్యేకత చాటుకున్నారని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చిన విధానం పెట్టుబడులకు దోహదపడుతోందని తెలిపారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీయూష్ గోయల్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, పారిశ్రామిక అభివృద్ధిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

రూ.12.14 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం

ఈ సదస్సులో వివిధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో 141 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి. వీటి ద్వారా సుమారు రూ.12.14 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని, తద్వారా 2.46 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు, వాటి అమలు ద్వారా సాధించిన పురోగతిని పరిగణనలోకి తీసుకుని ఈసారి లక్ష్యాలను నిర్దేశించారు.





తీరప్రాంతం.. పర్యాటకానికి అవకాశాలు

రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన బలమని, ఓడరేవుల అభివృద్ధి, అనుబంధ పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని స్వయంగా పరిశీలించి పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ సదస్సును రూ.12 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల లక్ష్యంతో నిర్వహిస్తున్నామని, వాటి ద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

పెట్టుబడులకు నమ్మకమైన ప్రాంతం ఏపీ

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు నమ్మకమైన ప్రాంతమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమైన బలమని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాష్ట్రం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోందని తెలిపారు.

చంద్రబాబు విజన్‌కు పట్టుదల తోడు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే దాని సాధన కోసం పట్టుదలతో పనిచేస్తారని జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు అన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఆయన ప్రస్తుతం అమరావతిపై దృష్టి సారించారని, భవిష్యత్తులో అది అభివృద్ధికి అనేక అవకాశాలున్న ప్రాంతంగా రూపుదిద్దుకోనుందని అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రస్తుత తరుణంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

సంప్రదాయ కళలతో స్వాగతం.. నేతల సందడి

సదస్సుకు విచ్చేసిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. ప్రాంగణం వద్ద థింసా, తప్పెటగుళ్లు, గరగ నృత్యాలతో కళాకారులు సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ కొద్దిసేపు డోలు వాయించి కళాకారులను ఉత్సాహపరిచారు. వారితో ఫొటోలు దిగారు. ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులను నేతలు అభినందించారు. అనంతరం ఏపీ పెవిలియన్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పెవిలియన్‌లను పీయూష్ గోయల్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రారంభించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌తో పాటు దేశాభివృద్ధికి ప్రధాని మోదీ చేసిన సూచనలను డిజిటల్ తెరపై ప్రదర్శించారు.




పెట్టుబడులపై పవన్‌తో లోకేశ్ చర్చ

సదస్సు ప్రారంభానికి ముందు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మంత్రి నారా లోకేశ్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న సంస్థలు, పారిశ్రామికవేత్తల వివరాలను పవన్‌కు వివరించారు. పెట్టుబడుల ఆకర్షణకు లోకేశ్ చేస్తున్న కృషిని పవన్ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే తరహా చొరవ కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దిశానిర్దేశం చేయడంతో పాటు, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ భాగస్వామ్య సదస్సు వేదికగా నిలుస్తోంది.

బొత్స కోటకు బీటలు అన్నది కట్టుకథే!

- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంపై తప్పుడు ప్రచారమంటున్న బెల్లాన చంద్రశేఖర్
- స్థానిక ఎన్నికల ఫలితాలతో నాయకుడి ప్రాభవాన్ని అంచనా వేయలేరు
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో బొత్స పాత్రను విస్మరించలేం



విజయనగరం : రాజకీయాల్లో గెలుపోటములు సహజం. కానీ ఒక్కో ఎన్నికల ఫలితాన్ని సాకుగా చూపి నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని ప్రశ్నించడం ఎంతవరకు సమంజసం? స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రాభవం తగ్గిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) తీవ్రంగా స్పందించారు. బొత్స రాజకీయ కోటకు బీటలు పడ్డాయన్న కథనాలు వాస్తవాలకు దూరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో నాలుగు దశాబ్దాల అనుభవం, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఆయన పోషించిన పాత్రను ఎన్నికల లెక్కలతో కొలవలేమని స్పష్టం చేశారు.

విద్యార్థి ఉద్యమాల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు!

విజయనగరం జిల్లాలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం విద్యార్థి దశ నుంచే ప్రారంభమైంది. విజయనగరం మహారాజా కళాశాలలో 1978-80 మధ్య విద్యార్థి నాయకుడిగా ప్రజా సమస్యలపై గళమెత్తారు. అక్కడి నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్ర రాజకీయాల్లో వివిధ కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యలపై అవగాహన, రాజకీయ అనుభవం తన ఎదుగుదలకు దోహదపడ్డాయని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

పదవులు ఎన్నో.. బాధ్యతలు మరెన్నో!

1999లో బొబ్బిలి లోక్‌సభ సభ్యుడిగా పార్లమెంటులో అడుగుపెట్టిన బొత్స సత్యనారాయణ అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. భారీ పరిశ్రమలు, రవాణా, పంచాయతీరాజ్, గృహనిర్మాణం, పురపాలక, పట్టణాభివృద్ధి, విద్యాశాఖ వంటి శాఖలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి, పేదలకు ఇళ్ల మంజూరు కార్యక్రమాల్లో తనదైన పాత్ర పోషించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా 'నాడు-నేడు' కార్యక్రమం అమలులో భాగస్వామ్యమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, పట్టణాభివృద్ధి కార్యక్రమాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రస్తావనకు వస్తున్నాయి.

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ముద్ర!

చీపురుపల్లి నియోజకవర్గంతో పాటు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల అభివృద్ధి అంశాల్లో బొత్స పేరు రాజకీయంగా తరచూ వినిపిస్తుంటుంది. తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు, విజయనగరం వైద్య కళాశాల, రహదారులు, పట్టణ మౌలిక వసతుల వంటి అంశాలను ఆయన అనుచరులు ప్రస్తావిస్తున్నారు. ఈ అభివృద్ధి పనుల వెనుక ఆయన పాత్రను విస్మరించలేమని బెల్లాన చంద్రశేఖర్ పేర్కొంటున్నారు.

ఎన్నికల ఫలితాలే రాజకీయ భవితవ్యానికి కొలమానమా?

స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను ఆధారంగా చేసుకుని ఒక సీనియర్ నాయకుడి రాజకీయ ప్రభావంపై తుది నిర్ణయానికి రావడం సరికాదన్నది బెల్లాన చంద్రశేఖర్ వాదన. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉండటమే నాయకుడి అసలైన బాధ్యత అని పేర్కొన్నారు.బొత్స సత్యనారాయణ రాజకీయ అనుభవం, గతంలో నిర్వహించిన పదవులు, ఉత్తరాంధ్ర లో ఆయనకు ఉన్న రాజకీయ సంబంధాలను పరిగణనలోకి తీసు కోకుండా ఏకపక్ష కథనాలు ప్రచారం చేయడం తగదని అన్నారు.

జిల్లా రాజకీయాల్లో మళ్లీ చర్చకు తెర!

బొత్స సత్యనారాయణ నాయకత్వం, వైఎస్సార్‌సీపీ భవిష్యత్ కార్యాచరణపై జిల్లాలో రాజకీయ చర్చ కొనసాగుతోంది. విమర్శలు, ప్రతివిమర్శల మధ్య పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడమే తమ లక్ష్యమని బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. బొత్స రాజకీయ ప్రస్థానంపై వస్తున్న విమర్శలకు ప్రజాక్షేత్రంలోనే సమాధానం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు.. ఫొటోలు



విశాఖపట్నం : విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతోంది. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు. ఆయనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్వాగతం పలికారు. వారంతా సదస్సు ప్రాంగణంలో కలియ తిరిగి వివిధ కళాబృందాల ప్రదర్శనలు తిలకించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ డోలు వాయించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి లోకేశ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


































తమిళనాడులో సర్ షాక్..



ఢిల్లీ : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతున్నది. 'సర్'లో భారీగా ఓట్లు తొలగించడం వల్లే తమ పార్టీలు ఓడిపోయాయని అటు తమిళనాడు మాజీ సీఎం ఎంకే స్టాలిన్, ఇటు బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ ఆరోపించడం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారింది. ముఖ్యంగా తమిళనాడులో చేపట్టిన 'సర్'లో భారీగా ఓట్ల తొలగింపు జరిగిన చోట్ల డీఎంకే స్థానాలు తగ్గుతూ.. ఇదే సమయంలో సీఎం విజయ్ పార్టీ 'టీవీకే'కు అంతకంతకూ సీట్లు పెరుగడం అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ మేరకు జాతీయ పత్రిక 'బిజినెస్‌లైన్' ఓ కథనాన్ని ప్రచురించింది.

'సర్'తో రికార్డ్ పోలింగ్

తమిళనాడులో ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డ స్థాయిలో 85.1 శాతం ఓటింగ్ నమోదైంది. 2021 ఎన్నికల్లో నమోదైన 73.6 శాతం ఓటింగ్‌తో పోలిస్తే ఇది ఎంతో ఎక్కువ. దీనికి ప్రధాన కారణం 2025 చివరిలో ఆ రాష్ట్రంలో ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియే నని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మరణించినవారు, నకిలీలు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారితో కలిపి తమిళనాడు 'సర్' ప్రక్రియలో సుమారు 97.3 లక్షల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయని, దీంతో ఓటర్ల సంఖ్య 6.7 కోట్ల నుంచి 5.73 కోట్లకు తగ్గినట్లు గుర్తుచేస్తున్నారు. ఓటర్ల సంఖ్య తగ్గడంతో సహజంగానే ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది.

డీఎంకే స్థానాల్లోనే తొలగింపు ఎక్కువ

2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాలను గెలుచుకోగా, అన్నాడీఎంకే 66 చోట్ల విజయం సాధించింది. మిగతా 35 చోట్ల ఇతరులు గెలిచారు. అయితే, డీఎంకే గెలిచిన 133 స్థానాల్లో 'సర్' ప్రక్రియ ద్వారా ఈసీ ఇటీవల చేపట్టిన ఓట్ల తొలగింపులు సగటున 31,454గా ఉన్నట్టు 'బిజినెస్‌లైన్' వెల్లడించింది. ఇదే సమయంలో అన్నాడీఎంకే గెలిచిన 66 నియోజకవర్గాల్లో 'సర్' ఓట్ల తొలగింపులు సగటు 26,953గా ఉన్నట్టు తేలింది. మిగతా పార్టీలు గెలిచిన చోట ఇవే తొలగింపులు 23,114గా రికార్డయ్యింది. దీన్నిబట్టి గతంలో డీఎంకే గెలిచిన నియోజకవర్గాల్లో సగటున 'సర్' ఓట్ల తొలగింపులు ఎక్కువగా ఉన్నట్టు అర్థమవుతున్నది.

గండికొట్టిన భారీ ఓట్ల తొలగింపులు

తమిళనాడులో 'సర్' పేరిట 97.3 లక్షల ఓట్లను తొలగించారు. ఇది స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే విజయావకాశాలకు ప్రధానంగా గండి కొట్టినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 'బిజినెస్‌లైన్' కథనం ప్రకారం.. తమిళనాడులోని మొత్తం 234 నియోజకవర్గాల్లో 19 నియోజకవర్గాల్లో 10 వేల వరకూ ఓట్ల తొలగింపు జరగ్గా, ఇందులో ఇటీవల జరిగిన ఎన్నికల్లో డీఎంకే 7 సీట్లను, అన్నాడీఎంకే 6 సీట్లను, టీవీకే రెండు సీట్లను గెలుచుకోగా మిగతా నాలుగు చోట్ల ఇతరులు గెలిచారు. ఇక, 80 నియోజకవర్గాల్లో 10 వేల నుంచి 20 వేల మేర ఓట్లు తొలగించగా, ఇందులో డీఎంకే 20, అన్నాడీఎంకే 24స్థానాలను గెలుచుకోగా టీవీకే 22 సీట్లలో విజయం సాధించింది. మిగతా 14 చోట్ల ఇతరులు గెలిచారు. 66 నియోజకవర్గాల్లో 20 వేల నుంచి 30 వేల మేర ఓట్లు తొలగిస్తే, డీఎంకే 21 సీట్లు, అన్నాడీఎంకే 11 సీట్లు, ఇతరులు రెండు స్థానాలను గెలుచుకోగా, టీవీకే మాత్రం 32 సీట్లలో విజయం సాధించింది. 37 నియోజకవర్గాల్లో 30 వేల నుంచి 50 వేల మధ్య ఓట్లు తొలగిస్తే, డీఎంకే 8, అన్నాడీఎంకే 5 స్థానాలకు పరిమితం కాగా టీవీకే మాత్రం 24 చోట్ల గెలిచింది.

ఇక, 22 నియోజకవర్గాల్లో 50 వేల నుంచి 80 వేల మేర ఓట్ల తొలగింపులు జరిగితే, డీఎంకే 3 సీట్లు, అన్నాడీఎంకే ఒక స్థానంలో గెలిస్తే, టీవీకే 18 స్థానాలను కైవసం చేసుకున్నది. అన్నింటికీ మించి.. 80 వేల పైచిలుకు ఓట్లను తొలగించిన 10 నియోజకవర్గాల్లో మొత్తం అన్నింటినీ టీవీకేనే గెలుచుకోవడం గమనార్హం. దీన్నిబట్టి, ఓట్ల తొలగింపులు పెరిగిన చోట డీఎంకే దెబ్బతినగా, టీవీకే లబ్ధి పొందినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మంత్రులూ ఓడారు


'సర్' ప్రక్రియపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమిళనాడులో డీఎంకే అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందని పలువురు రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల్లో 133 సీట్లను గెలుచుకొన్న స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఇటీవలి ఎన్నికల్లో 59 స్థానాలకు పరిమితమైంది. గత స్టాలిన్ ప్రభుత్వ మంత్రివర్గంలోని 32 మంది మంత్రుల్లో 15 మంది ఓడిపోవడానికి 'సర్'లో తొలగించిన 5-10 వేల ఓట్లే కారణమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అంతేకాదు, ఉత్తర తమిళనాడులోని 69 స్థానాల్లో 30కి పైగా స్థానాలు, పశ్చిమ తమిళనాడులోని 20కి పైగా స్థానాలను 10 వేలలోపు ఓట్ల తేడాతో డీఎంకే చేజార్చుకొన్నట్టు గుర్తుచేస్తున్నారు. 'సర్' ప్రక్రియపై అప్రమత్తంగా ఉంటే, డీఎంకే సులభంగా అధికారంలోకి వచ్చేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బెంగాల్‌లో మమత పార్టీకి 'సర్' సెగ

బెంగాల్‌లో మమత కంచుకోట బీటలువారడానికి 'సర్'లో భారీగా టీఎంసీ అనుకూల ఓట్లను తొలగించడమే కారణంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొద్ది ఓట్ల తేడాతో టీఎంసీ భారీగా సిట్టింగ్ స్థానాలను కోల్పోవడాన్ని దీనికి ఉదాహరణగా చెప్తున్నారు. బెంగాల్‌లో అత్యధికంగా ముర్షిదాబాద్ జిల్లాలో 4.55 లక్షల మంది ఓటర్లను 'సర్' ప్రక్రియలో భాగంగా తొలగించారు. 2021 ఎన్నికల్లో ఆ జిల్లాలో ఉన్న 22 సీట్లలో 20 స్థానాల్లో టీఎంసీ విజయం సాధించగా ఈ ఎన్నికల్లో అనూహ్యంగా తొమ్మిది స్థానాలకే పరిమితమైంది. మైనారిటీ ఓట్లను భారీగా తొలగించడమే దీనికి కారణంగా రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక, ఉత్తర 24 పరగణాలు జిల్లాలో 3.25 లక్షల మంది ఓటర్ల పేర్లను ఇటీవల జాబితా నుంచి తొలగించారు.గతంలో ఈ జిల్లాలోని మొత్తం 33 స్థానాల్లో 28 సీట్లను గెలిచిన టీఎంసీ.. ఈసారి కేవలం 8 సీట్ల దగ్గరే ఆగిపోయింది. మాల్దా జిల్లాలో 2.39 లక్షల ఓట్లను తొలగించగా.. అక్కడ గతంలో టీఎంసీ 8 స్థానాలను గెలుచుకోగా.. ఇప్పుడు ఆ సంఖ్య ఆరుకు పడిపోయింది. టీఎంసీ చేజార్చుకొన్న ఈ అన్ని స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గమనార్హం. 'సర్' ప్రక్రియలో భాగంగా భారీగా ఓటర్లను తొలగించడమే టీఎంసీ ఓటమికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా బెంగాల్ 'సర్'లో తొలగించిన ఓట్ల శాతం 11.88 శాతంగా ఉండగా.. బీజేపీ, టీఎంసీ మధ్య ఓట్ల వ్యత్యాసం 5.04 శాతంగా ఉండటం గమనార్హం.

మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు కన్నుమూత!

- విశాఖ అపోలో ఆసుపత్రిలో తుదిశ్వాస
- మూడు పర్యాయాలు ఎంపీగా.. పలుమార్లు ఎమ్మెల్యేగా సేవలు
- మంత్రిగా, శాసనమండలి సభ్యుడిగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు శత్రుచర్ల విజయరామ రాజు కన్నుమూసినట్లు సమాచారం. విశాఖపట్నం లోని అపోలో ఆసుపత్రిలో గురువారం ఆయన తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. విజయనగరం జిల్లా చినమేరంగి సంస్థానానికి చెందిన శత్రుచర్ల విజయరామరాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. శాసనసభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, శాసనమండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర రాజకీయాలతో దశాబ్దాల అనుబంధం కలిగిన విజయరామరాజు పార్వతీపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. తొమ్మిదో, పదో, పన్నెండో లోక్‌సభల్లో సభ్యుడిగా పనిచేశారు. శాసనసభ్యుడిగానూ పలుమార్లు ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలోనూ కొనసాగారు. రాష్ట్ర రాజకీయాల్లో అనేక పరిణామాలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన ఆయన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల్లో కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర విభజన సమయంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2014లో కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అదే ఏడాది శ్రీకాకుళం జిల్లా పాతపట్నం శాసనసభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2017లో శ్రీకాకుళం స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికయ్యారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రాజకీయాలతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. చినమేరంగి సంస్థాన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. పార్లమెంటు నుంచి శాసనసభ వరకు, రాష్ట్ర మంత్రివర్గం నుంచి శాసనమండలి వరకు వివిధ స్థాయుల్లో బాధ్యతలు నిర్వహించిన విజయరామరాజు రాజకీయ జీవితం ఎన్నో మలుపులతో సాగింది. ఉత్తరాంధ్రలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఆయన తీసుకున్న నిర్ణయాలు పలుమార్లు చర్చనీయాంశమయ్యాయి. దశాబ్దాల రాజకీయ అనుభవంతో రాష్ట్ర రాజకీయాల్లో తనదైన స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఆయన మరణవార్తతో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఒక సీనియర్ నాయకుడి సుదీర్ఘ ప్రస్థానం ముగిసినట్లయింది.

సూపర్ ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రమాదంలో దేశ ఆహార రంగం!



పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' రాబోయే రోజుల్లో దేశీయ ఆహార భద్రతను తీవ్రంగా దెబ్బతీసే అవకాశముందని ఆహార పరిశ్రమ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. సెప్టెంబర్-అక్టోబర్ నాటికి పసిఫిక్ ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరడంతో వచ్చే శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ముందస్తు వేసవిలో తీవ్ర వడగాలులు వీచే ప్రమాదముందని పూర్వ భూవిజ్ఞాన శాఖ కార్యదర్శి మాధవన్ రాజీవన్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు పంట దిగుబడిని తగ్గించి, సరఫరా గొలుసును దెబ్బతీసి, నిత్యావసరాల ధరలను పెంచే సూచనలు కనిపిస్తున్నాయి. భారత పప్పుధాన్యాల, ధాన్యాల సంఘం (ఐపీజీఏ) అధ్యక్షుడు బిమల్ కొఠారీ మాట్లాడుతూ.. 'రాబోయే కొన్ని నెలల గురించి కాకుండా, 2027 సంవత్సరంపైనే మాకు ప్రధాన ఆందోళన ఉంది' అని వ్యాఖ్యానించారు. శనగ పంటకు కీలకమైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మరోవైపు, చక్కెర విభాగంపై కూడా ఈ ప్రభావం సుదీర్ఘంగా ఉండనుంది. '2026-27, 2027-28 సీజన్లలో చక్కెర ఉత్పత్తి, లభ్యత తీవ్ర సవాలుగా మారనున్నాయి' అని ఇండియన్ షుగర్ ఫెడరేషన్ ఆఫ్ గ్రెయిన్ ఎనర్జీ ప్రతినిధి దిలీప్ పాటిల్ తెలిపారు. నిపుణులు దిలీప్ పాటిల్, శేఖర్ గైక్వాడ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి సమర్పించిన నివేదిక ప్రకారం.. చక్కెర ధరల్లో నిర్మాణపరమైన ద్రవ్యోల్బణ ముప్పు 2026 దీపావళి నాటికి కాకుండా, 2027 జూన్-అక్టోబర్ నాటికి ఎక్స్-మిల్ ధరలు కిలో రూ.50 దాటే అవకాశం ఉందన్నారు. నూనెగింజల విభాగంపై కూడా సూపర్ ఎల్‌నినో ప్రభావం పడనుందని శ్రీ రేణుకా షుగర్స్ డైరెక్టర్ అతుల్ చతుర్వేది హెచ్చరించారు. మహారాష్ట్ర, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో చెరకు, సోయాబీన్, వేరుశనగ పంటలు నీటి అభావంతో ఎండిపోతున్నాయని తెలిపారు. పశుగ్రాసం ధరలు పెరగడంతో పశు సంవర్ధక విభాగం కూడా ఆందోళన చెందుతోంది. రాబోయే 6 నెలల్లోనే దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోకపోతే 2027 నాటికి దేశం తీవ్ర ఆహార ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోక తప్పదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

చంద్రబాబు పాలనలో నిరుద్యోగమే



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో మన రాష్ట్రం నిరుద్యోగితలో దేశంలోనే రెండోస్థానంలో ఉంది. నిరుద్యోగితలో మన రాష్ట్రం 7.8 శాతంతో కేరళం తరువాత స్థానంలో ఉంది. ఈ ఏడాది జూలై--సెప్టెంబర్ మధ్య వివిధ రాష్ట్రాల్లో నిరుద్యోగిత గణాంకాలను లేబర్ ఫోర్స్ సర్వే బులెటిన్ వెల్లడించింది. దీన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలుశాఖ బుధవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగిత జాతీయస్థాయిని మించి ఉందని ఆ బులెటిన్ తెలిపింది. జాతీయస్థాయిలో నిరుద్యోగిత 5.1 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 7.8 శాతం ఉందని పేర్కొంది. ఆ బులెటిన్ ప్రకారం.. రాష్ట్రంలో పురుషుల కన్నా మహిళల్లో నిరుద్యోగిత శాతం ఎక్కువగా ఉంది. నిరుద్యోగిత పురుషుల్లో 6.8 శాతం ఉండగా.. మహిళల్లో 9.6 శాతం ఉంది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల కన్నా పట్టణ ప్రాంతాల్లోనే నిరుద్యోగిత ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 7.8 శాతం ఉన్న నిరుద్యోగిత పట్టణ ప్రాంతాల్లో 8.0 శాతం ఉంది. పురుషుల నిరుద్యోగిత పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఉండగా.. మహిళల నిరుద్యోగిత గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. నిరుద్యోగ పురుషులు గ్రామీణ ప్రాంతాల్లో 6.6 శాతం మంది ఉండగా పట్టణ ప్రాంతాల్లో 7.3 శాతం మంది ఉన్నారు. నిరుద్యోగ మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో 9.7 శాతం మంది ఉండగా పట్టణ ప్రాంతాల్లో 9.5 శాతం మంది ఉన్నారు. 2024లో జరిగిన ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని లేదంటే అప్పటివరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 29 నెలలైనా ఆ హామీని అమలు చేయలేదు. ఉద్యోగాలు కల్పించకపోగా నిరుద్యోగభృతికి ఎగనామం పెట్టారు. దీంతో రాష్ట్రంలో యువతీ, యువకులకు ఉపాధి లభించక నిరుద్యోగిత పెరిగిపోతోంది.

సెలబ్రిటీల జీవితాల్లో విడాకుల తుపాను

అమరావతి: వివాహ బంధం.. ఒకప్పుడు జీవితాంతం కొనసాగాల్సిన అనుబంధంగా భావించేవారు. కుటుంబ గౌరవం, పిల్లల భవిష్యత్, సామాజిక కట్టుబాట్లు, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎన్నో సమస్యలను భరిస్తూ దాంపత్య జీవితాన్ని కొనసాగించేవారు. కానీ.. కాలంతోపాటు ఆలోచనా విధానాలూ మారుతున్నాయి. ఆత్మగౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన, సమానత్వానికి ప్రాధాన్యం పెరుగుతోంది. పరస్పర అవగాహన లేని బంధంలో కొనసాగడం కంటే విడిపోవడమే మంచిదనే నిర్ణయానికి కొందరు వస్తున్నారు. సాధారణ ప్రజల నుంచి సెలబ్రిటీల వరకు ఈ పరిణామం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ వైవాహిక బంధాల విచ్ఛిన్నానికి సంబంధించిన గణాంకాలు ఆసక్తికరమైన అంశాలను వెల్లడిస్తున్నాయి. ముంబైలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపీఎస్) పరిశోధకులు హరిహర్ సాహూ తదితరులు రూపొందించిన 'మారిటల్ డిసల్యూషన్ ఇన్ ఇండియా: ప్యాటరన్స్ అండ్ కొరిలేట్స్' పేరిట దేశవ్యాప్తంగా 5,11,604 మంది, ఏపీకి సంబంధించి 21,585 మంది మహిళలపై అధ్యయనం జరిపింది. ఏపీలో 15--49 ఏళ్ల వయసున్న.. గతంలో వివాహమైన మహిళల్లో 2.36 శాతం మంది వైవాహిక బంధాల విచ్ఛిన్నాన్ని ఎదుర్కొన్నారు. వీరిలో చట్టబద్ధంగా విడాకులు పొందినవారు 0.54 శాతం కాగా.. విడిగా జీవిస్తున్న వారు 1.82 శాతం. అంటే విడాకులు తీసుకున్న వారికంటే విడిగా ఉంటున్న వారిసంఖ్య మూడు రెట్లకు పైగా ఉంది. జాతీయ స్థాయిలో ఈ రెండు కేటగిరీల ఉమ్మడి వాటా 1.50 శాతం కాగా.. దక్షిణాది సగటు 2.30 శాతంగా నమోదైంది. తమిళనాడులో 2.46 శాతం, తెలంగాణలో 2.49 శాతం, కేరళలో 2.14 శాతం, కర్ణాటకలో 2.05 శాతంగా ఉంది. ఈశాన్య రాష్ట్రాల్లో వైవాహిక బంధాల విచ్ఛిన్నం అధికంగా నమోదైంది. మిజోరంలో 9.25 శాతం, మేఘాలయలో 6.74 శాతంగా ఉంది. పేద కుటుంబాల్లో ఈ వాటా 1.7 శాతం ఉండగా, అత్యంత సంపన్న కుటుంబాల్లో 1 శాతంగా నమోదైంది. కేంద్ర ప్రభుత్వ నమూనా నమోదు వ్యవస్థ (ఎస్ఆర్ఎస్) 2024 నివేదిక ప్రకారం.. దేశ జనాభాలో విడాకులు పొందినవారు, విడిగా జీవిస్తున్నవారి ఉమ్మడి వాటా 2014లో 4.1 శాతం ఉండగా.. 2024లో 3.5 శాతానికి తగ్గింది. అయితే, మహిళల్లో ఈ వాటా 5.4 శాతం కాగా, పురుషుల్లో 1.6 శాతమే. ఏపీలో ఇదే వాటా 2014లో 5.2 శాతం ఉండగా, 2024లో 5 శాతంగా నమోదైంది. రాష్ట్రంలో కుటుంబ వివాదాల తీవ్రతకు ఫ్యామిలీ కోర్టుల గణాంకాలు మరో కోణాన్ని చూపుతున్నాయి. రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలో 15 ఫ్యామిలీ కోర్టులు పనిచేస్తున్నాయి.

ఆలోచనశక్తికి ఏఐ వైరస్

అమరావతి: సైన్స్ ప్రాజెక్టా? కృత్రిమ మేధ సిద్ధంగా ఉంది. వ్యాసం రాయాలా? ఏఐ సెకన్లలో రాసిచ్చేస్తుంది. కోడింగ్ ఎర్రరా? టూల్ సరిచేస్తుంది. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం విద్యారంగాన్ని పరుగులు పెట్టించడం నిజమే అయినా.. దానికి సమాంతరంగా విద్యార్థుల స్వతంత్ర ఆలోచనశక్తికి గండికొడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చేతికి వచ్చిన సరికొత్త 'కాగ్నిటివ్ ఆఫ్--లోడింగ్' (మెదడు చేయాల్సిన ఆలోచనను మెషీన్‌కు అప్పగించే ధోరణి) యువతరాన్ని ఆలోచనశక్తి హీనులుగా మార్చేస్తోందంటున్నారు. ఇది భవిష్యత్ తరాలను వేగంగా ప్రమాదంలోకి నెడుతోందని ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న అధ్యయనాలు, సర్వేలు హెచ్చరిస్తున్నాయి.

అంతర్జాతీయ విద్యాసంస్థలు, డిజిటల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ--సింగపూర్), చీగ్ గ్లోబల్ నివేదికల ప్రకారం ఉన్నతవిద్య విద్యార్థుల్లో జనరేటివ్ ఏఐ సాధనాల వినియోగం శరవేగంగా పెరిగింది. మనదేశంలోను ఇంజినీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 శాతం మంది విఫలమవడానికి కారణం ఏఐపై అధికంగా ఆధారపడడమేనని చెబుతున్నారు. మెదడును శ్రమపెట్టే విద్యార్థే భవిష్యత్తులో సాంకేతికతను నడిపిస్తాడని, లేదంటే సాంకేతికతే ఆ విద్యార్థిని నడిపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల ఏఐ వినియోగం

కొత్తగా అరచేతిలోకి వచ్చిన కృత్రిమ మేధ మనుషుల మేధస్సును తుస్సుమనిపిస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో తమ మెదడుకు పనిచెప్పకుండా, ఆలోచనకు పదును పెట్టకుండా సులభంగా పనిపూర్తయ్యే మార్గాల కోసం ఏఐని ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతున్నట్టు డీఈసీ సర్వేలో వెల్లడైంది. హోంవర్క్ చేసేందుకు, ప్రాజెక్టుల కోసం, అసైన్‌మెంట్లు, అనువాదాలు, పరీక్షల సన్నద్ధత, అకడమిక్ పేపర్ల ఎనాలసిస్.. ఇలా ఒకటేంటి అన్నింటికీ జనరేటివ్ ఏఐ సాధనాలపై ఆధారపడుతున్నట్టు గుర్తించారు.


ఈ విధానం ఎక్కువగా, యూకే, లాటిన్ అమెరికా, భారత్, యూఎస్ఏ, యూరప్ దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరుసలో యునైటెడ్ కింగ్‌డమ్ 92--95 శాతంతో మొదటిస్థానంలో ఉండగా మనదేశం 86--89 శాతంతో మూడోస్థానంలో ఉంది. యూకేలో అసైన్‌మెంట్లు, రీసెర్చ్ సారాంశాలు, కాన్సెప్ట్ క్లారిటీ కోసం, బ్రెజిల్, మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాల్లో ప్రాజెక్టులు, అనువాదాలు, హోంవర్క్ కోసం ఏఐని వాడుతుండగా, భారతదేశంలో కోడింగ్ సమస్యలు, పరీక్షల సన్నద్ధత, ప్రాజెక్టుల కోసం, అమెరికాలో వ్యాసాలు, బ్రెయిన్ స్టార్టింగ్, క్విజ్ ప్రిపరేషన్ కోసం, ఫ్రాన్స్, జర్మనీ వంటి యూరప్ దేశాల్లో థీసిస్ రీసెర్చ్, అకడమిక్ పేపర్ల తయారీకి వాడుతున్నారు.

శాతాల పరంగా బ్రిటన్ మొదటిస్థానంలో ఉన్నప్పటికీ.. సంఖ్యా పరంగా చూస్తే భారతదేశమే ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది. దేశంలో ఉన్న సుమారు 4.3 కోట్లమంది ఉన్నతవిద్య విద్యార్థుల్లో ఏకంగా 3.5 కోట్ల మందికిపైగా రోజూ లేదా వారానికి పలుమార్లు ఏఐని వాడుతున్నట్టు తేలింది. యూఎస్‌లో ఈ సంఖ్య 1.4 కోట్లు ఉండగా, యూకేలో సుమారు 20 లక్షల వద్ద ఉంది.

ఆలోచన శూన్యం.. క్యాంపస్‌లలో వైఫల్యాలు:

జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థుల్లో స్వంతంగా శోధించి నేర్చుకునే సంస్కృతి తగ్గిపోతోందని సర్వేలు చెబుతున్నాయి. ఇది మానవ మేధస్సును నాశనం చేస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. విషయ పరిజ్ఞానం పెంచుకోకుండా కాపీ--పేస్ట్ సంస్కృతి విస్తరిస్తోందంటున్నారు. ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం ప్రతి పదిమంది విద్యార్థుల్లో ఆరుగురు (60 శాతం) ఏఐ ఇచ్చిన ఫలితాలను క్రాస్‌చెక్ చేయకుండా నేరుగా సబ్మిట్ చేస్తున్నారు. విద్యార్థులు స్వయంగా గ్రంథాలయాలు, పుస్తకాల్లో చదివి పరిశోధన చేసే సమయం గతంతో పోలిస్తే సుమారు 45 శాతం తగ్గింది.

కాగ్నిటివ్ ఇంపాక్ట్ స్టడీస్ ప్రకారం.. నిరంతరం ఏఐ టూల్స్‌పై ఆధారపడే విద్యార్థుల్లో సమస్య పరిష్కార సామర్థ్యం, సమాచారాన్ని నిలుపుకొనే జ్ఞాపకశక్తి సాధారణ విద్యార్థుల కంటే 20--25% తగ్గుముఖం పడుతోంది.



కార్పొరేట్ హెచ్‌ఆర్ సర్వేల ప్రకారం, దేశవ్యాప్తంగా క్యాంపస్ డ్రైవ్‌లలో పాల్గొనే భారతీయ ఐటీ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 40--50 శాతం మంది ముఖాముఖి ఇంటర్వ్యూలలో ప్రాథమిక లాజిక్, మాన్యువల్ కోడింగ్ రాయడంలో విఫలమవుతున్నారు. కాలేజీల్లో ఆటోమేటెడ్ కోడ్ జెనరేషన్ టూల్స్ వాడటం వల్ల, మొదటి నుంచి సొంతంగా లాజిక్ నిర్మించే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తోందని, దీంతో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూలలో తేలిపోతున్నారని చెబుతున్నారు.

ఏఐ టూల్స్ కొన్నిసార్లు ఉనికిలో లేని తప్పుడు సమాచారాన్ని కూడా సరైనదేనన్నట్లు భ్రమింపజేస్తాయని, సర్వేల ప్రకారం 55 శాతం మంది విద్యార్థులు ఆ ఆధారాలను ధ్రువీకరించుకోకుండానే తమ ప్రాజెక్టుల్లో జోడిస్తున్నారని గుర్తించారు.

భారత విద్యావ్యవస్థకు సవాళ్లు

యూకే, యూఎస్ వంటి దేశాల్లో ఏఐ అకాడమిక్ ఎథిక్స్, డిటెక్షన్ సాఫ్ట్‌వేర్ల వినియోగం ఇప్పటికే మొదలైంది. భారత్‌లో సీబీఎస్ఈ, యూజీసీ వంటి విద్యామండళ్లు మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తీవ్ర అంతరాలున్నాయి. విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్, అసైన్‌మెంట్లు నిమిషాల్లో పూర్తవుతుండటంతో అసలైన ప్రతిభను గుర్తించడం అధ్యాపకులకు పెద్ద సవాలుగా మారింది. దేశంలోని 80 శాతం విద్యాసంస్థల్లో సరైన ఏఐ--డిటెక్షన్ వ్యవస్థలు అందుబాటులో లేవు. పాశ్చాత్య దేశాల్లో విద్యార్థులు ఆలోచనలకు మెరుగులు దిద్దుకోవడానికి ఏఐని వాడితే, భారత్‌లో ఇంకా చాలామంది విద్యార్థులు శ్రమను తప్పించుకునే 'షార్ట్‌కట్'గా మాత్రమే చూస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని పరిష్కారమార్గాలను అనుసరిస్తే విద్యార్థిని 'మాస్టర్'గా నిలబెట్టవచ్చని పేర్కొంటున్నారు.

ప్రాజెక్ట్ పేపర్లను మాత్రమే చూసి మార్కులు వేసే విధానానికి స్వస్తి పలకాలి. విద్యార్థి సమస్యను ఎలా పరిష్కరించాడు, ఏ

ఏకగ్రీవ పంచాయతీలకు.. ప్రోత్సాహకాలు



అమరావతి: రాష్ట్రంలో తొలిదశ పంచాయతీ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యం లో ఏకగ్రీవ పంచాయతీలకు అందించే ప్రోత్సాహకాలను ప్రభుత్వం భారీగా పెంచింది. కనిష్ఠంగా రూ.15 లక్షలు, గరిష్ఠంగా రూ.50 లక్షలు అందించనుంది. ఇప్పటివరకు ఉన్న నాలుగు కేటగిరీలను మూడుకు కుదించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఉత్తర్వులు వెలువడనున్నాయి. తాజా నిర్ణయం ప్రకారం ఏకగ్రీవమైన వాటిలో 5 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10 వేలలోపు జనాభాగల పంచాయతీలకు రూ.25 లక్షలు, పదివేల కంటే మించిన జనాభా గల పంచాయతీలకు రూ.50 లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పటివరకు 2 వేలలోపు జనాభా ఉండే పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5 వేలలోపు జనాభాగల పంచాయతీలకు రూ.10 లక్షలు, 5,001 నుంచి 10 వేల లోపు జనాభాగల పంచాయతీలకు రూ.15 లక్షలు, 10 వేలపైన జనాభాగల పంచాయతీలకు రూ.20 లక్షలు ఇచ్చేవారు.

15 పరిశ్రమల ఏర్పాటుకు జీవోలు



అమరావతి: రాష్ట్రప్రభుత్వం చెబుతున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు విశాఖపట్నంలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు అర్థం చెప్పింది. ఎంఓయూ కుదుర్చుకున్న తర్వాత పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు.. భూముల కేటాయింపు వేగవంతం చేశామని ప్రభుత్వం ఇప్పటివరకు చెప్పింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని మాటల్లో చెప్పడమే కాకుండా.. చేతల్లో చూపింది. ఇటీవల అనుమతించిన 15 సంస్థల పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా విశాఖ సదస్సులో జీవోలు ఇచ్చింది.

పల్లె పోరుకు నగారా!


- తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 26న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతకు రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం.. తాజాగా తొలి విడత ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 18న నామినేషన్ల పరిశీలన చేపడతారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై 19న అప్పీళ్లకు అవకాశం కల్పించగా, 20న వాటిని పరిష్కరిస్తారు. 21వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. అదే రోజు బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అనంతరం ఈ నెల 26వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అవసరమైన చోట్ల 27వ తేదీన రీపోలింగ్ నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొనగా.. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాల కోసం ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

తొలి విడత ఎన్నికల ముఖ్యమైన తేదీలు

నవంబర్ 13 – ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
నవంబర్ 15 – ఆర్వో/ఈవో ఎన్నికల నోటీసు
నవంబర్ 17 – నామినేషన్ల స్వీకరణకు తుది గడువు
నవంబర్ 18 – నామినేషన్ల పరిశీలన
నవంబర్ 19 – తిరస్కరణపై అప్పీళ్లు
నవంబర్ 20 – అప్పీళ్ల పరిష్కారం
నవంబర్ 21 – నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా
నవంబర్ 26 – పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాలు
నవంబర్ 27 – అవసరమైతే రీపోలింగ్



నాడు వెన్నంటి.. నేడు ఎదురుబాట!

- సొంత మనుషులే.. రాజకీయ ప్రత్యర్థులు
- జగన్‌కు దూరమైన కుటుంబ సభ్యులు, ఆప్తులు
- ఒకప్పుడు అండగా నిలిచిన వారే నేడు సవాళ్లు
- షర్మిల నుంచి విజయసాయిరెడ్డి వరకు.. మారిన రాజకీయ సమీకరణాలు
- నాయకత్వ శైలిపైనా పార్టీలో అంతర్మథనం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్థానం ఎన్నో సంచలనాలకు వేదికైంది. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఎదురైన రాజకీయ సంక్షోభం నుంచి సొంత పార్టీ ఏర్పాటు వరకు.. సీబీఐ కేసులు, జైలు జీవితం, సుదీర్ఘ ప్రతిపక్ష పోరాటం.. ఇలా ప్రతి మలుపులోనూ ఆయనకు అండగా నిలిచిన కొందరు వ్యక్తులు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆర్థిక వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించినవారు, రాజకీయ వ్యూహకర్తలు.. ఇలా ఒకప్పుడు జగన్‌కు అత్యంత ఆప్తులుగా ఉన్నవారే ఇప్పుడు ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. మరికొందరు రాజకీయ ప్రత్యర్థులుగా మారుతున్నారు. తాజాగా నాలుగు దశాబ్దాలుగా వైఎస్ కుటుంబంతో అనుబంధం కలిగి, వైఎస్సార్‌సీపీలో కీలక నేతగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి సైతం సొంత రాజకీయ పార్టీని స్థాపించడంతో ఈ పరిణామాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

ఆప్తులే ఎందుకు దూరమవుతున్నారు?

జగన్‌కు అత్యంత సన్నిహితులు దూరమవుతున్న పరిణామాలకు ఆయన కుటుంబంలో చోటుచేసుకున్న విభేదాలే ప్రధాన ఉదాహరణగా కనిపిస్తున్నాయి. తండ్రి మరణం తర్వాత రాజకీయంగా జగన్‌కు అండగా నిలిచిన చెల్లెలు వైఎస్ షర్మిల.. ఆయన జైలు జీవితంలో పార్టీ కోసం పాదయాత్ర చేపట్టి ప్రజల్లోకి వెళ్లారు. తల్లి వైఎస్ విజయమ్మ సైతం పార్టీ గౌరవాధ్యక్షురాలిగా కొంతకాలం కీలక పాత్ర పోషించారు. అయితే, కాలక్రమంలో అన్నాచెల్లెళ్ల మధ్య రాజకీయ విభేదాలు, కుటుంబ ఆస్తుల పంపకాల అంశాలు తెరపైకి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. షర్మిల కాంగ్రెస్‌లో చేరి జగన్‌కు రాజకీయ ప్రత్యర్థిగా మారగా, విజయమ్మ సైతం వైఎస్సార్‌సీపీకి దూరమయ్యారు. తాజాగా షర్మిల కుమార్తె వివాహ వేదిక విషయంలోనూ కుటుంబ విభేదాలు మరోసారి వార్తల్లో నిలిచాయి. ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారం జగన్ కుటుంబంలో మరో కీలక పరిణామం. వివేకా కుమార్తె డాక్టర్ సునీత తన తండ్రి హత్య కేసులో న్యాయం కోసం న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు, నిందితుల విషయంలో జగన్ కుటుంబంపై వచ్చిన రాజకీయ ఆరోపణలు కూడా వైఎస్ కుటుంబంలో విభేదాలను మరింత బహిర్గతం చేశాయి. అయితే ఈ వ్యవహారంలో ఆరోపణలు, న్యాయస్థానాల్లో నిర్ధారణ అయిన అంశాలను వేర్వేరుగా చూడాల్సి ఉంది.

విధేయుల నుంచి ప్రత్యర్థులుగా..

కుటుంబ సభ్యులకే పరిమితం కాకుండా, రాజకీయంగా జగన్‌కు అండగా నిలిచిన పలువురు నేతలు కూడా ఆయనకు దూరమయ్యారు. వైఎస్ కుటుంబానికి సన్నిహితుడిగా, పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి.. పార్టీ అంతర్గత పరిణామాలు, తనకు తగిన ప్రాధాన్యం లభించలేదన్న అసంతృప్తితో వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలో చేరారు. ఒకప్పుడు జగన్‌కు అత్యంత ఆప్తుడిగా ఉన్న బాలినేని పార్టీ మారడం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన నరసాపురం మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు.. ఆ తర్వాత జగన్ ప్రభుత్వ విధానాలను, నాయకత్వ తీరును బహిరంగంగా విమర్శించడం ప్రారంభించారు. దీంతో ఆయనకు, వైఎస్సార్‌సీపీ నాయకత్వానికి మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడ్డాయి. ఆయనపై నమోదైన కేసులు, అరెస్టు, కస్టడీలో వేధింపుల ఆరోపణలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకప్పుడు పార్టీ విజయానికి తోడ్పడిన వ్యక్తే చివరకు జగన్‌కు రాజకీయ ప్రత్యర్థిగా మారడం మరో కీలక పరిణామం.

విజయసాయిరెడ్డి నిష్క్రమణ.. కొత్త రాజకీయ వేదిక

ఈ పరిణామాలన్నింటిలోనూ విజయసాయిరెడ్డి రాజకీయ ప్రయాణం ప్రత్యేకంగా నిలుస్తోంది. 1980ల నుంచి వైఎస్ కుటుంబంతో అనుబంధం కలిగి, ఆర్థిక సలహాదారుగా, పార్టీ వ్యూహకర్తగా కీలక పాత్ర పోషించిన ఆయన.. జగన్ రాజకీయ ప్రస్థానంలోనూ అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొందారు. సీబీఐ కేసుల సమయంలోనూ జగన్‌తో పాటు నిందితుడిగా ఉన్న ఆయన, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యసభ సభ్యుడిగా, పార్టీ జాతీయ స్థాయి వ్యవహారాల్లో కీలక నేతగా వ్యవహరించారు. అయితే 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి తర్వాత ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 2025 జనవరిలో రాజకీయాలకు, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విజయసాయిరెడ్డి.. కొంతకాలం తర్వాత మళ్లీ రాజకీయంగా చురుగ్గా మారారు. చివరకు 2026 నవంబర్ 11న విజయవాడ వేదికగా 'పరివర్తన రాజనీతి పార్టీ'ని స్థాపించారు. కుటుంబ, వారసత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఒకప్పుడు జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న వ్యక్తి ఇప్పుడు సొంత రాజకీయ వేదిక ఏర్పాటు చేయడం ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామంగా మారింది.

జగన్ చుట్టూ ఎందుకిలా..?

ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే ఒక కీలక ప్రశ్న ముందుకొస్తోంది. జగన్ నాయకత్వంలో ఏమైనా లోపాలున్నాయా? లేక అధికారం, రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత విభేదాలే ఈ దూరాలకు కారణమా? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయాల్లో ఒక నాయకుడి ఎదుగుదలకు కార్యకర్తలు, అనుచరులు, వ్యూహకర్తలు, ఆప్తుల సహకారం ఎంతో అవసరం. అయితే అధికారంలో ఉన్నప్పుడు వారందరినీ కలుపుకొని వెళ్లడం, విభేదాలు వచ్చినప్పుడు చర్చల ద్వారా పరిష్కరించుకోవడం కూడా అంతే ముఖ్యం. తన చుట్టూ ఉన్నవారికి నిర్ణయాల్లో ఎంతవరకు భాగస్వామ్యం కల్పించారు? భిన్నాభిప్రాయాలను ఎంతవరకు స్వీకరించారు? పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అందరికీ సముచిత ప్రాధాన్యం దక్కిందా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. జగన్ చుట్టూ ఒక ప్రత్యేక వర్గం మాత్రమే ప్రాధాన్యం పొందిందని, సుదీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసిన కొందరు నేతలకు తగిన గుర్తింపు దక్కలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు లేకపోలేదు. అయితే ఈ ఆరోపణలపై జగన్, వైఎస్సార్‌సీపీ నాయకత్వం వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పార్టీని వీడిన ప్రతి ఒక్కరి నిర్ణయం వెనుక ఒకే కారణం ఉందని చెప్పలేం. వ్యక్తిగత విభేదాలు, రాజకీయ ఆకాంక్షలు, పార్టీ అంతర్గత పరిణామాలు, మారుతున్న రాజకీయ సమీకరణాలు కూడా ఇందుకు కారణమై ఉండవచ్చు.

ఒంటరిగా మిగిలిపోతారా?

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఎదురైన కష్టకాలంలో జగన్‌కు అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, రాజకీయ సహచరులు, వ్యూహకర్తలు ఒక్కొక్కరుగా దూరమవడం సాధారణ రాజకీయ పరిణామంగా కొట్టిపారేయలేని అంశం. ముఖ్యంగా విజయసాయిరెడ్డి వంటి కీలక నేత సొంత పార్టీ ఏర్పాటు చేయడం వైఎస్సార్‌సీపీకి కొత్త రాజకీయ సవాలుగా మారింది. ఒక నాయకుడి బలం కేవలం పదవుల్లోనో, ప్రజాదరణలోనో ఉండదు. ఆయనతో కలిసి నడిచే నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఏర్పడే బంధంలోనూ ఉంటుంది. ఒకప్పుడు తన రాజకీయ ప్రస్థానంలో కీలక పాత్ర పోషించిన వారితో ఏర్పడిన విభేదాలను జగన్ ఏ విధంగా అధిగమిస్తారు? పార్టీని వీడిన నేతలను తిరిగి కలుపుకుంటారా? మిగిలిన నాయకత్వాన్ని, క్షేత్రస్థాయి శ్రేణులను ఏ విధంగా సమన్వయం చేసుకుంటారు? అన్నది భవిష్యత్ రాజకీయాలకు కీలకం కానుంది. ఒకప్పుడు జగన్ కోసం నిలిచినవారే నేడు ఆయనకు ఎదురుగా నిలుస్తుండటం.. ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరమైన మలుపు. ఈ పరిణామాల నుంచి జగన్ ఎలాంటి పాఠాలు నేర్చుకుంటారన్నదే ఇప్పుడు అసలైన ప్రశ్న!

భోగాపురం బీచ్‌కు అంతర్జాతీయ కళ.. జాంటీ రోడ్స్ బ్రాండ్ అంబాసిడర్!

- ముక్కం తీరంలో రూ.55 కోట్లతో కోస్టల్ వెల్‌నెస్ సెంటర్.. సర్ఫ్ క్లబ్ ఏర్పాటుకు ముందడుగు
- సీఎం చంద్రబాబుతో దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం భేటీ.. విశాఖ CII సదస్సులో ఏపీతో ఒప్పందం

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చే దిశగా మరో కీలక అడుగు పడింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని సముద్ర తీరానికి ప్రపంచస్థాయి పర్యాటక ఆకర్షణ తీసుకురావడానికి రంగం సిద్ధమవుతోంది. దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం, మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ ఏపీ పర్యాటక రంగంతో భాగస్వామ్యం కావడం విశేషం.

విశాఖపట్నంలో జరుగుతున్న CII భాగస్వామ్య సదస్సుకు హాజరైన జాంటీ రోడ్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. భోగాపురం విమానాశ్రయం సమీపంలోని ముక్కం బీచ్‌లో ఏర్పాటు చేయనున్న ముక్కం కోస్టల్ వెల్‌నెస్, సర్ఫ్ క్లబ్‌కు ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు.

రూ.55 కోట్లతో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు!

ముక్కం బీచ్‌లో సుమారు రూ.55 కోట్ల పెట్టుబడితో కోస్టల్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత సంస్థ ముందుకొచ్చింది. సముద్ర తీర సహజ అందాలను పర్యాటక రంగ అభివృద్ధికి అనుసంధానిస్తూ వెల్‌నెస్, సర్ఫింగ్ వంటి ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకురావాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం.




భోగాపురం ఎయిర్‌పోర్టుతో పర్యాటకానికి కొత్త ఊపు!

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో సమీప తీర ప్రాంతాల్లో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం పెరుగుతోంది. విమానాశ్రయానికి సమీపంలోనే ముక్కం బీచ్‌లో ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటు కావడం ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది.

క్రికెట్ మైదానం నుంచి పర్యాటక ప్రచారం వరకు!

ప్రపంచ క్రికెట్‌లో తన ఫీల్డింగ్ నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాంటీ రోడ్స్, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటకానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనుండటం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఆయనకున్న గుర్తింపు ముక్కం బీచ్‌ను పర్యాటక గమ్యస్థానంగా ప్రచారం చేయడానికి ఉపయోగపడనుంది. పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, విమానాశ్రయ అనుసంధానం.. ఈ మూడు అంశాలు కలిసివస్తే ఉత్తరాంధ్ర తీర ప్రాంత పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడే వీలుంది. అయితే రూ.55 కోట్ల ప్రాజెక్టు ఎప్పుడు ప్రారంభమవుతుంది? ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తుంది? అంతర్జాతీయ ప్రమాణాలతో ఎలాంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి? అన్నది కార్యాచరణపై స్పష్టత వచ్చిన తర్వాత తేలనుంది.



పెట్టుబడుల వెల్లువ.. ఉద్యోగాల జోరు!

విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపునిస్తోంది. నూతన సాంకేతికతలు, పారిశ్రామిక విస్తరణకు అనుగుణంగా సంస్కరణలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచుతోంది. సదస్సు రెండో రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ రంగాలకు చెందిన సంస్థలు రూ.1.14 లక్షల కోట్ల విలువైన 12 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సీఆర్డీఏ, మారిటైమ్ బోర్డు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పీ4, హిందాల్కో, హీరో తదితర రంగాలకు సంబంధించిన ఒప్పందాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. సమర్థవంతమైన, సుస్థిర నాయకత్వం ఉంటే అభివృద్ధి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టారని, ప్రజలకు మంచి చేస్తే వారే ఆశీర్వదిస్తారని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం ప్రభుత్వంపై వారికి ఏర్పడిన నమ్మకానికి నిదర్శనమన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత కుటుంబ ప్రయోజనాలకే పరిమితం కాకుండా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజమే మన కుటుంబమని, అందరూ బాగుంటేనే మనమూ బాగుంటామని వ్యాఖ్యానించారు.

ప్రకాశం జిల్లా కందుకూరులో మైనింగ్ కార్యకలాపాల నిర్వహణకు హిందాల్కో గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. తద్వారా సుమారు 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు తిరుపతి జిల్లాలో ఆర్బిటల్ డేటా సెంటర్, రాకెట్ తయారీ కేంద్రం ఏర్పాటుకు కూడా ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో సాంకేతిక, పారిశ్రామిక రంగాల విస్తరణకు దోహదపడనున్నాయి.

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఇప్పటికే తిరుపతిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న డిక్సన్ టెక్నాలజీస్ రాష్ట్రంలో మరింత విస్తరించేందుకు ఆసక్తి చూపుతోంది. సంస్థ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పంకజ్ శర్మ శుక్రవారం మంత్రి నారా లోకేష్‌తో విశాఖపట్నంలో సమావేశమయ్యారు. ఈ భేటీలో తిరుపతి ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్-2లో మరో రూ.700 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సంస్థ సుముఖత వ్యక్తం చేసింది. ఈ విస్తరణతో సుమారు 2,300 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. భారత్‌లోనే అతిపెద్ద ఎల్ఈడీ టీవీ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తిరుపతి డిక్సన్ ప్లాంట్‌ను అభివృద్ధి చేసిన సంస్థ.. కొప్పర్తి, తిరుపతిలో మరిన్ని విస్తరణ ప్రణాళికలను రూపొందిస్తోంది. కడప జిల్లా కొప్పర్తిలో ఏఐఎల్ డిక్సన్ (సీపీ ప్లస్) యూనిట్‌ను రూ.450 కోట్లతో విస్తరిస్తున్నట్లు పంకజ్ శర్మ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మరో 7 వేల ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం లభించిందన్నారు. డిక్సన్-ఇన్వెంటెక్ సంయుక్త భాగస్వామ్యంతో ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు, సర్వర్ల తయారీ కేంద్రాన్ని కూడా ఏపీలో ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ సంస్థ ప్రతినిధులను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించడంతో పాటు, మరిన్ని విస్తరణ ప్రణాళికలకు ఏపీని కేంద్రంగా ఎంచుకోవాలని కోరారు. ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని పంకజ్ శర్మ వెల్లడించారు.

పెట్టుబడుల పుష్కలం.. ప్రజలకు దక్కేదెంత?

- పెట్టుబడుల లెక్కలు.. ఓట్లకు కొలమానాలా?
- రూ.12.14 లక్షల కోట్ల ఒప్పందాలతో ఏపీకి పారిశ్రామిక భరోసా
- కాగితాలపై ఒప్పందాలు కాదు.. క్షేత్రస్థాయిలో ఫలితాలే కీలకం
- సామాన్యుడి జీవితంలో మార్పు రాకుంటే ప్రచారం వృథా
- ఆర్థిక ప్రగతి.. రాజకీయ విజయంగా మారుతుందా?



అమరావతి/విశాఖపట్నం: లక్షల కోట్ల పెట్టుబడులు.. లక్షలాది ఉద్యోగాల కల్పన.. అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలతో ఒప్పందాలు.. వెరసి విశాఖ వేదికగా జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుపై భారీ ఆశలు రేకెత్తించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖుల సమక్షంలో రెండు రోజులపాటు సాగిన ఈ సదస్సులో రూ.12.14 లక్షల కోట్ల విలువైన 141 అవగాహన ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీటి ద్వారా 2.46 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుంది. హరిత ఇంధనం, అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధ, రక్షణ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత ఏడాది సదస్సులో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలకు కొనసాగింపుగా తాజా ఒప్పందాలు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునిచ్చే అవకాశముంది. అయితే.. ఈ భారీ అంకెలు రాష్ట్రానికి ఎంతవరకు మేలు చేస్తాయి? రాజకీయంగా అధికార కూటమికి ఎలాంటి ప్రయోజనం చేకూరుస్తాయి? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

ఒప్పందాల నుంచి పరిశ్రమల వరకు..

పెట్టుబడుల సదస్సుల్లో లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు కుదరడం ఒక ఎత్తయితే.. వాటిని వాస్తవ పరిశ్రమలుగా మార్చడం మరో ఎత్తు. అవగాహన ఒప్పందం కుదిరినంత మాత్రాన పెట్టుబడి వెంటనే రాష్ట్రానికి చేరదు. భూముల కేటాయింపు, అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక వెసులుబాటు, సంస్థల నిర్ణయాలు వంటి అనేక అంశాలపై వాటి అమలు ఆధారపడి ఉంటుంది. గతంలోనూ వివిధ రాష్ట్రాల్లో జరిగిన పెట్టుబడుల సదస్సుల్లో భారీ ప్రకటనలు వెలువడినా, వాటిలో కొంతభాగమే కార్యరూపం దాల్చిన సందర్భాలున్నాయి. అందువల్ల విశాఖ సదస్సులో ప్రకటించిన రూ.12.14 లక్షల కోట్ల ప్రతిపాదనల్లో ఎంతమేరకు పెట్టుబడులు వాస్తవరూపం దాలుస్తాయి? ఎన్ని పరిశ్రమలు ఏర్పాటవుతాయి? ఎంతమందికి ఉద్యోగాలు లభిస్తాయి? అన్నదే అసలు పరీక్ష.



పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడం ఎంత ముఖ్యమో, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఒప్పందాలను నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కేవలం ఒప్పందాల సంఖ్యతో విజయాన్ని కొలవలేం. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి ప్రారంభం, స్థానికులకు ఉపాధి కల్పన వంటి అంశాలే ఆర్థిక ప్రగతికి అసలైన కొలమానాలు.

ఆర్థిక అంకెలు.. ఓట్లుగా మారతాయా?

ఇక్కడే రాజకీయ కోణం తెరపైకి వస్తోంది. లక్షల కోట్ల పెట్టుబడులు, భారీ ఉద్యోగాల లక్ష్యాలు, రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి వంటి గణాంకాలు ప్రభుత్వానికి ప్రచార అస్త్రాలుగా ఉపయోగపడవచ్చు. కానీ అవే ఎన్నికల్లో ఓట్లుగా మారతాయన్న హామీ లేదు. ఎందుకంటే ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేసేది కేవలం రాష్ట్ర ఆర్థిక ప్రగతి మాత్రమే కాదు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, నిత్యావసర వస్తువుల ధరలు, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక ప్రజాప్రతినిధుల పనితీరు వంటి అనేక అంశాలు ఎన్నికల తీర్పులో కీలక పాత్ర పోషిస్తాయి. గత రాజకీయ పరిణామాలూ ఇదే విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతూ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించిన చంద్రబాబు నాయుడు 2004 ఎన్నికల్లో అధికారాన్ని నిలబెట్టుకోలేకపోయారు. అలాగే 2004 సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం ముందుకు తెచ్చిన 'ఇండియా షైనింగ్' ప్రచారం కూడా ఎన్నికల ఫలితాలను అనుకూలంగా మలచలేకపోయింది. అభివృద్ధి గణాంకాలకు, ప్రజల దైనందిన అనుభవాలకు మధ్య వ్యత్యాసం ఉంటే రాజకీయంగా ఎదురయ్యే సవాళ్లు ఎలా ఉంటాయో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. దీర్ఘకాలిక పారిశ్రామిక ప్రగతి రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చినా, తక్షణ సమస్యల పరిష్కారంలో లోపాలుంటే ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముంది.

ప్రచారం కంటే ప్రజానుభవమే ముఖ్యం!

రూ.12 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనల గురించి ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేసుకున్నా, ఆ ప్రభావం సామాన్యుడి జీవితంలో కనిపించాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు అందుబాటు లోకి రావాలి. రైతులకు గిట్టుబాటు ధరలు, కూలీలకు ఉపాధి, మధ్యతరగతికి ధరల భారం నుంచి ఉపశమనం లభించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సకాలంలో జరగాలి. స్థానిక సంస్థల పాలన ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఇవన్నీ సమాంతరంగా సాగినప్పుడే అభివృద్ధిపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. లేకుంటే పెట్టుబడులపై చేసే విస్తృత ప్రచారానికి, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు మధ్య అంతరం పెరిగే ప్రమాదం ఉంది. ఉద్యోగాల ప్రకటనలు వెలువడుతున్నా యువతకు ఉపాధి దక్కకపోతే, అభివృద్ధి గణాంకాలు పెరుగుతున్నా కుటుంబాల ఖర్చుల భారం తగ్గకపోతే ప్రభుత్వ ప్రచారంపైనే ప్రశ్నలు తలెత్తుతాయి. అందుకే పెట్టుబడుల ప్రకటనలతో పాటు వాటి అమలు పురోగతిని కూడా పారదర్శకంగా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.

అసలైన సవాలు ఇప్పుడే!

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి పెట్టుబడుల ప్రతిపాదనలు, పారిశ్రామిక అవకాశాలు లభించాయి. అయితే ఈ ఆర్థిక అవకాశాలను ప్రజలకు కనిపించే అభివృద్ధి ఫలితాలుగా మార్చడం ప్రభుత్వ ముందున్న ప్రధాన బాధ్యత. కుదిరిన ఒప్పందాల అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించాలి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి, కొత్త పరిశ్రమల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. అదే సమయంలో ప్రజల రోజువారీ సమస్యల పరిష్కారంపైనా పాలన యంత్రాంగం దృష్టి సారించాలి. ఎందుకంటే.. పెట్టుబడుల ప్రకటనలు రాష్ట్ర భవిష్యత్తుపై ఆశలు కల్పిస్తాయి. వాటి ఆచరణ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది మాత్రం ప్రజలకు అందే పాలనా ఫలితాలే. రూ.12.14 లక్షల కోట్ల ఒప్పందాలు ఏపీ ఆర్థిక ప్రగతికి ఎంతవరకు దోహదపడతాయన్నది రానున్న కాలమే తేల్చాలి. ఆర్థిక విజయాన్ని రాజకీయ విజయంగా భావించే ముందు, ఆ అభివృద్ధి సామాన్యుడి గడపను ఎంతవరకు తాకిందో అంచనా వేసుకోవాల్సి ఉంటుంది. చివరికి ఎన్నికల్లో ప్రజలు లెక్కలు చూడరు.. తమ జీవితాల్లో వచ్చిన మార్పును బేరీజు వేసుకుంటారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకే ప్రభుత్వ ప్రోత్సాహకాలు

నంద్యాల: గ్రామాల్లో సామరస్యం, ఐక్యత, పరస్పర సహకార భావనను పెంపొందించి, ఎన్నికల సమయంలో తలెత్తే వర్గ విభేదాలు, వివాదాలను తగ్గించడంతో పాటు ఏకాభిప్రాయంతో కూడిన స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఆ లక్ష్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే ఏకగ్రీవ ఎన్నికల ప్రోత్సాహక నగదును గణనీయంగా పెంచిందని కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.ద2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన పెంచిన ప్రోత్సాహక మొత్తాలను అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.

పెంచిన ప్రోత్సాహక నగదు వివరాలు:

5,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు,
5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.25 లక్షలు,
10,000కు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షలు,

గతంలో 2,000 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, 2,001 నుంచి 5,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10 లక్షలు, 5,001 నుంచి 10,000 వరకు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 10,000కు పైగా జనాభా కలిగిన పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందించేవారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ మొత్తాలను పెంచుతూ నూతన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

ప్రోత్సాహకానికి వర్తించే నిబంధనలు: సర్పంచ్ పదవితో పాటు



గ్రామ పంచాయతీలోని అన్ని వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు సంబంధిత చట్టాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించిన గ్రామ పంచాయతీలకు మాత్రమే ఈ ప్రోత్సాహకం వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. నగదు విడుదలకు ముందు సంబంధిత అధికారులు ఆయా గ్రామ పంచాయతీల అర్హతను పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుంద న్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ప్రోత్సాహక మొత్తాన్ని సంబంధిత గ్రామ పంచాయతీల పరిధిలో ఆమోదించిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వినియోగించాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించి నిర్దేశించిన ఆర్థిక, లెక్కల నిర్వహణ, ఆడిట్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.

వేంకటేశ్వర స్వామి చిత్రాన్ని గీసిన తొలి చిత్రకారుడు కన్నుమూత



చెన్నై: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రాన్ని గీసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ చిత్రకారుడు శ్రీనివాసన్ (86) కన్నుమూశారు. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన ఆయన.. వయోభారంతో ఈరోజు తుదిశ్వాస విడిచారు. ప్రపంచవ్యాప్తంగా కనిపించే వెంకటేశ్వర స్వామి చిత్రాన్ని గీసింది ఆయనే కావడం విశేషం. అలాంటి చిత్రకారుడు ఇక లేరన్న వార్తతో ఆయన చిత్రకళా ప్రస్థానం మరోసారి గుర్తుకొస్తోంది.

1970లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు గర్భగుడిలోని శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రత్యక్షంగా చూసి చిత్రించేందుకు ఆసక్తి ఉన్న చిత్రకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందుకోసం ఓ వార్తాపత్రికలో ప్రకటన ఇచ్చారు. ప్రముఖ చిత్రకారుడు ఓవిమామణి కొండైరాజు వద్ద చిత్రకళను అభ్యసించిన శ్రీనివాసన్ ఈ అవకాశానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన పేరును పరిశీలించిన టీటీడీ.. తిరుమలకు రావాలని లేఖ పంపించింది. అయితే, ఆ సమయంలో శ్రీనివాసన్‌కు తట్టు వ్యాధి సోకడంతో నిర్ణీత తేదీన తిరుపతికి వెళ్లలేకపోయారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత టీటీడీ పంపిన లేఖతో తిరుమలకు చేరుకున్నారు. తన అనారోగ్య సమస్యను అధికారులకు వివరించి, గర్భగుడి సమీపంలో కూర్చొని స్వామివారి చిత్రాన్ని గీసేందుకు అనుమతి కోరారు. ఇందుకోసం ఆయన చాలాకాలం ప్రయత్నించాల్సి వచ్చింది. చివరకు అధికారులు అనుమతి ఇచ్చారు. స్వామివారి విగ్రహంతో పాటు ఆభరణాలను కూడా చిత్రించేందుకు అవకాశం కల్పించారు. ఆభరణాలతో అలంకరించిన రూపంతో పాటు, అలంకరణ లేని స్వామివారి చిత్రాన్ని కూడా గీసేందుకు సమయం కేటాయించారు. అలా గర్భగుడి సమీపంలో కూర్చొని శ్రీనివాసన్ గీసిన వెంకటాచలపతి చిత్రం విశేష ప్రజాదరణ పొందింది. కొండైరాజు గురుకులంలో చిత్రకళను అభ్యసించిన శిష్యుల్లో ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేకత ఉండేది. ఆ చిత్రకళా సంప్రదాయానికి చెందిన శ్రీనివాసన్ తన కుంచెతో శ్రీవేంకటేశ్వర స్వామి రూపాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. ఆయన గీసిన చిత్రాన్ని శివకాశి ప్రింటర్స్ ముద్రించి, క్యాలెండర్ల రూపంలోనూ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఆ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భక్తుల ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో కనిపించే ప్రసిద్ధ చిత్రంగా మారింది.

సినీనటుడు గిరిబాబు కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ తెలుగు సినీ నటుడు గిరిబాబు కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ కొండాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. 1946 జూన్ 8న ప్రకాశం జిల్లా కొరిశపాడు రావినూతల గ్రామంలో జన్మించిన ఆయన 'జగమే మాయ' చిత్రంతో సినీ పరిశ్రమకు పరిచయమయ్యారు. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 'సింహ గర్జన', 'మెరుపుదాడి', 'ఇంద్రజిత్', తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు. 'రణరంగం', 'ఇంద్రజిత్' 'నీ సుఖమే నే కోరుకున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. గిరిబాబు సతీమణి 2016లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు రఘుబాబు, బోసుబాబు ఇద్దరు కుమారులు. రఘుబాబు హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. 2023లో 'అన్నీ మంచి శకునములే' గిరిబాబు నటించిన చివరి చిత్రం.

సర్పంచ్ పదవి రూ.29 లక్షలకు కొనేసిన టీడీపీ నేత

అనంతపురం: ఏకగ్రీవాల పేరుతో సర్పంచ్ పదవుల కోసం టీడీపీ కోట్లు కుమ్మరిస్తోంది. సర్పంచ్ పదవులకు వేలం పాటలు జోరుగా సాగుతున్నాయి. సర్పంచ్ పదవిని రూ.29 లక్షలకు టీడీపీ నేత కొనుగోలు చేశారు. శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కొప్పలకొండలో రామాలయం వద్ద గ్రామస్తులు బహిరంగ వేలం నిర్వహించారు. టీడీపీ నేత ఎల్ఐసి ఆదినారాయణ 29 లక్షలకు సర్పంచ్ పదవి కైవసం చేసుకున్నారు ఏకగ్రీవం పేరుతో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్నారు. కొప్పల కొండ వేలం పాట దృశ్యాలు.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా, పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో సర్పంచ్ పదవికి కూడా టీడీపీ నాయకులు వేలం నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలంలో యర్రా శ్రీనివాసరావు రూ.81 లక్షలకు పాట దక్కించుకున్నారు. సర్పంచ్ పదవి కోసం మొత్తం ముగ్గురు పోటీ పడ్డారు. కొరిటాల గోపాలరావు రూ.77 లక్షలు చెల్లించేందుకు సిద్ధపడ్డారు. చివరకు శ్రీనివాసరావు పాట దక్కించుకున్నారు. ఆయనను సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో నిలపాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు.

మధుమేహంపై 'సాంకేతిక' సమరం!

- సూది బాధకు స్వస్తి.. చక్కెర స్థాయిలపై నిరంతర నిఘా
- రోజంతా గ్లూకోజ్ గుట్టు విప్పుతున్న సీజీఎం
- ప్రజారోగ్యంపై పాలకుల దృష్టి ఎటు.. ఆధునిక వైద్యం సామాన్యుడికి చేరేదెప్పుడు?



ప్రత్యేక కథనం

మధుమేహం.. నేడు ఇంటింటినీ వేధిస్తున్న మహమ్మారి. ఒకప్పుడు వృద్ధాప్యానికి పరిమితమైన ఈ వ్యాధి ఇప్పుడు యువతనూ వెంటాడుతోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, జీవనశైలి మార్పులు మధుమేహ బాధితుల సంఖ్యను పెంచుతున్నాయి. రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవాలంటే ప్రతిసారీ వేలికి సూది గుచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ ఇబ్బందులకు ఆధునిక సాంకేతికత తెరదించుతోంది. అదే కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్ (సీజీఎం). శరీరంలో అమర్చే చిన్న సెన్సార్‌తో 24 గంటలూ గ్లూకోజ్ స్థాయిలను పర్యవేక్షించే ఈ విధానం మధుమేహ నియంత్రణలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది.

సూది లేకుండానే నిరంతర పర్యవేక్షణ!

సాధారణంగా గ్లూకోమీటర్‌తో చక్కెర స్థాయిలను తెలుసుకోవాలంటే వేలికి సూది గుచ్చి రక్త నమూనా పరీక్షించాలి. రోజులో పలుమార్లు ఈ ప్రక్రియ బాధాకరంగా మారుతోంది. సీజీఎం విధానంలో చర్మం కింద అమర్చే చిన్న సెన్సార్ ద్వారా కణాల మధ్య ద్రవంలోని గ్లూకోజ్ స్థాయిలను నిరంతరం గుర్తిస్తారు. ఆ సమాచారాన్ని స్మార్ట్‌ఫోన్‌కు పంపుతుంది. చక్కెర పెరుగుతున్నా.. తగ్గుతున్నా ముందుగానే హెచ్చరిస్తుంది. ఫలితంగా ప్రమాదకర పరిస్థితులను గుర్తించి అప్రమత్తం కావచ్చు.

హెచ్చరికలే కాదు.. ఆరోగ్యానికి దిక్సూచి!

టైప్-1 మధుమేహ బాధితులు, ఇన్సులిన్ తీసుకునే టైప్-2 రోగులకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరం. ఆహారం తీసుకున్న తర్వాత, వ్యాయామం చేసినప్పుడు, నిద్ర సమయంలో గ్లూకోజ్ స్థాయుల్లో వచ్చే మార్పులను తెలుసుకోవచ్చు. చికిత్సలో అవసరమైన మార్పులపై వైద్యులు మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది దోహదపడుతుంది.



కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటరింగ్ ద్వారా మధుమేహం లీడింగ్ తెలుసుకునే దృశ్యం

టీబీఐఆర్ కాదు.. టీఐఆర్ కీలకం!

సీజీఎంలో అత్యంత ప్రాధాన్యమైన అంశం టైమ్ ఇన్ రేంజ్. రోజులో ఎంత సమయం రక్తంలోని గ్లూకోజ్ నిర్దేశిత లక్ష్య పరిధిలో ఉందో ఇది తెలియజేస్తుంది. హెచ్‌బీఏ1సీ పరీక్ష గత రెండు, మూడు నెలల సగటు చక్కెర స్థాయిని తెలియజేస్తే.. టీఐఆర్ రోజువారీ హెచ్చుతగ్గులపై స్పష్టత ఇస్తుంది. చికిత్సా విధానాన్ని మెరుగుపరచడానికి ఇది ఉపయోగపడుతుంది.

సాంకేతికత అందుబాటులోకి వచ్చేదెప్పుడు?

మధుమేహం నియంత్రణలో ఆధునిక పరికరాలు కీలకంగా మారుతున్న తరుణంలో వాటి ధర, అందుబాటు కూడా చర్చనీయాంశాలే. ఖరీదైన వైద్య సాంకేతికత సామాన్యులకు అందకపోతే ఆవిష్కరణల ప్రయోజనం ఎవరికి? ప్రజారోగ్యంపై బాధ్యత వహించే ప్రభుత్వాలు ఆధునిక మధుమేహ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు, అవసరమైన వారికి సాంకేతిక పరికరాల అందుబాటుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆహారమే తొలి ఔషధం!

సీజీఎం అమర్చుకున్నంత మాత్రాన మధుమేహం అదుపులోకి వచ్చేస్తుందని భావించకూడదు. క్రమబద్ధమైన ఆహారం, పీచు పదార్థాలు అధికంగా ఉండే తృణధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు తీసుకోవాలి. స్వీట్లు, చక్కెర పానీయాలు, శుద్ధి చేసిన ఆహారాన్ని పరిమితం చేయాలి. రోజువారీ వ్యాయామం, వైద్యుల సూచనల మేరకు మందులు, ఇన్సులిన్ వినియోగం తప్పనిసరి.

అవగాహనే అసలైన ఆయుధం!

మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, కళ్లు, నరాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముందస్తు గుర్తింపు, నిరంతర పర్యవేక్షణ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలే దీర్ఘకాలిక ఆరోగ్యానికి మార్గం. సీజీఎం సాంకేతికత మధుమేహ నియంత్రణకు కొత్త ఆయుధం. అయితే వైద్యుల పర్యవేక్షణకు ఇది ప్రత్యామ్నాయం కాదు.

- డాక్టర్ నల్లి రవికుమార్
రీసెర్చర్, మైక్రోబయాలజిస్ట్, బయోకెమిస్ట్రీ న్యూట్రిషనిస్ట్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు



రబీలో భీకర కరువు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌తో సహా ఐదు రాష్ట్రాల్లో రబీలో కరువు భీకరరూపం దాలుస్తుందని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈ రాష్ట్రాల్లో వ్యవసాయ రుణాలతోపాటు పంట ఉత్పత్తులకు అత్యధిక ముప్పు వాటిల్లుతుందని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో వ్యవసాయ దుర్బలత్వం అత్యధికంగా ఉంటుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో కరువు తీవ్రంగా ఉంటుందని అంచనా వేసింది. ఈ నాలుగు జిల్లాల్లో రబీలో దాదాపు 90 శాతం లోటు వర్షపాతం ఉంటుందని వెల్లడించింది. అంతే కాకుండా ఈ నాలుగు జిల్లాల్లో వ్యవసాయ రుణాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, రబీలో రూ.20,256 కోట్ల వ్యవసాయ రుణాలపై ప్రభావం ఉంటుందని నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కరువు ఎదుర్కోవడానికి సుమారు రూ.13,776 కోట్లు అవసరం అవుతాయని, అలాగే ఈ ఐదు రాష్ట్రాలపై రూ.33,000 కోట్ల ఆర్థిక భారం పడుతుందని నివేదిక అంచనా వేసింది. రబీ సీజన్‌లో పంట నష్టం ఎక్కువగా 20 జిల్లాల్లో ఉంటుందని, ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, బాపట్ల, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో పంట నష్టం అధికంగా ఉంటుందని పేర్కొంది. తెలంగాణలో నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో కరువు ముప్పు అత్యధికంగా ఉంటుందని వివరించింది. తమిళనాడులో సుమారు రూ.43,548 కోట్లు, మహారాష్ట్రలో రూ.12,115 కోట్ల వ్యవసాయ రుణాలపై ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. కరువు కారణంగా ఖరీఫ్, రబీలో కలిపి దేశంలో సుమారు 3.86 కోట్ల టన్నుల వ్యవసాయ పంటల ఉత్పత్తికి నష్టం వాటిల్లుతుందని, ఇందులో ఖరీఫ్‌లో 0.89 కోట్ల టన్నులు, రబీలో 2.97 కోట్ల టన్నులు నష్టం ఉంటుందని నివేదిక పేర్కొంది. ఈ వ్యవసాయ ఉత్పత్తుల విలువ సుమారు రూ. లక్ష కోట్లు ఉండొచ్చని అభిప్రాయపడింది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 1.35 కోట్ల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో పంట ఉత్పత్తులపై ప్రభావం పడే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.

135 మంది డాక్టర్లకు షోకాజ్ నోటీసులు

ముప్పాళ్ళ : ఆంధ్రప్రదేశ్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సరిగా వైద్యం అందించని 135 మంది డాక్టర్లకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జూలై నుంచి నవంబరు వరకు ఫోన్ ద్వారా రోగుల అభిప్రాయాలు సేకరించి డాక్టర్ల పనితీరును పరిశీలించారు. ఈ సర్వేలో 81.6 శాతంతో పల్నాడు మొదటి స్థానంలో నిలిచింది. 81.5 శాతంతో పోలవరం, 80.7 శాతంతో నెల్లూరు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కర్నూలు 69.5 శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

బకాయిలు ఉంటే పోటీకి అనర్హులు

అమరావతి: గ్రామ పంచాయతీకి ఇంటి పన్ను తదితర బకాయిలు ఉన్న వారు సర్పంచి/వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు అనర్హులని రాష్ట్ర ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల నియమావళిలోనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. అయితే నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు నో-డ్యూస్ సర్టిఫికెట్ అందజేయాల్సిన అవసరం లేదని గతంలో ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాజాగా, బకాయిలు ఉంటే నామినేషన్ల పరిశీలన సమయంలో ప్రత్యర్థి ఫిర్యాదు చేయడానికి, నిబంధనల ప్రకారం అలాంటి వారు పోటీకి అనర్హులుగా అధికారులు పేర్కొనడానికి అవకాశం ఉంటుందని వెల్లడించడం గమనార్హం. మరోవైపు అభ్యర్థి నామినేషన్ దాఖలు సమయంలో అందజేసే స్వీయ డిక్లరేషన్ ఫార్మేట్లో బకాయిల అంశం కూడా ఉండడం విశేషం. ఒకరు ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో పోటీ చేయడానికి వీలుండదని ఎన్నికల నిబంధనావళిలో పేర్కొన్నారు. అయితే, ఒకటి కంటే ఎక్కువ వార్డులకు ఎవరైనా నామినేషన్ దాఖలు చేసినా, ఏదో ఒక చోట నుంచే పోటీ చేయాలని స్పష్టం చేసింది. అయితే, ఎక్కువ చోట్ల నామినేషన్లు వేసి ఎక్కడా ఉపసంహరించుకోకుంటే అన్ని నామినేషన్లు చెల్లుబాటు కాకుండా పోతాయని పేర్కొంది.

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు

చిలకలూరిపేట: కష్టకాలంలో పార్టీ కోసం అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి నివాస ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన కౌన్సిలర్ అభ్యర్థులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని 48 వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు, బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలను అభ్యర్థులు, బూత్ ఏజెంట్లు విడదల రజినికి వివరించారు. రజిని మాట్లాడుతూ చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అరాచకాలకు, దౌర్జన్యాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని మండిపడ్డారు. పోలీసుల అండతో బూత్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు లాగి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బెదిరించి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అన్ని రకాలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. ఇన్ని అరాచకాలు చేసి సాధించిన గెలుపు మీ గొప్పతనం కాదు.. ప్రజల మనసులు గెలుచుకున్న గెలుపు అంతకన్నా కాదని అన్నారు. ఈ ఎన్నికల్లో ఫలితాల పరంగా ఓటమిని ఎదుర్కొన్నప్పటికీ, నైతికంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయం సాధించారన్నారు. పదవులు, అధికారాలు తాత్కాలికమని, ప్రజల కోసం నిలబడే నాయకత్వం, కార్యకర్తల నిబద్ధత శాశ్వతమని అన్నారు. ఈ పోరాటంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపించిన ధైర్యాన్ని, తెగువను ఎప్పటికీ మర్చిపోనని, కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజల మనసుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందని, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డిపై ప్రజలకు అభిమానం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ రానున్న మన ప్రభుత్వంలో తగిన గుర్తింపు, మంచి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు.
అభివృద్ధి పేరుతో ప్రజలకు అధికార పార్టీ చూపిస్తున్న ప్రగతి ఏమిటని ప్రశ్నించారు. పేకాట క్లబ్బుల నిర్వహణ, అసాంఘిక కార్యకలాపాలకు ప్రోత్సాహం ఇవ్వడమే వీళ్ల అభివృద్ధికి నమూనానా? అని నిలదీశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం పక్కనపెట్టి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడటమే పరిపాలన విధానంగా మారిందని విమర్శించారు. ఓటమి భయంతోనే టీడీపీ నిష్పక్షపాత ఎన్నికలకు భయపడి, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శించారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి తగిన సమాధానం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. అనంతరం అన్ని 48 వార్డుల్లో పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులను విడదల రజిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, కౌన్సిలర్లు పోతుల దీపిక, సుదర్శనం సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడా ఏకగ్రీవాలే లక్ష్యమా?

అమరావతి: రాష్ట్రంలో 20 శాతం పంచాయతీలు ఏకగ్రీవం కావాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆకాంక్షించడం రాజకీయ, ప్రజాస్వామిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థకు నేతృత్వం వహిస్తున్న సీనియర్ అధికారి ఏకగ్రీవాలపై ప్రత్యేకంగా ఆశాభావం వ్యక్తం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల కమిషనర్ బాధ్యత ఏకగ్రీవాలను ప్రోత్సహించడమా? లేక ప్రజలకు పోటీ చేసే, తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం కల్పించడమా? అని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలే ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే ప్రధాన వేదిక. గ్రామ స్థాయిలో సైతం ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి. పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తప్ప కాకపోయినా, ఏకగ్రీవాల శాతాన్ని ముందుగానే లక్ష్యంగా నిర్దేశించుకోవడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఉండటం ప్రజాస్వామ్యానికి సహజ లక్షణం. అలాంటప్పుడు 20 శాతం పంచాయతీలు ఏకగ్రీవం కావాలని ఆశించడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏకగ్రీవాల కోసం రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంటుంది. ఏకగ్రీవాలు నిజంగా గ్రామస్తుల ఏకాభిప్రాయంతోనే జరుగుతున్నాయా? లేక రాజకీయ ప్రాబల్యం, అధికార ఒత్తిళ్ల ప్రభావంతో జరుగుతున్నాయా? ఈ నేపథ్యంలో పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించడం, ఓటర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించడం ఎన్నికల కమిషన్ ప్రాథమిక బాధ్యత. ఆ బాధ్యతను పక్కనపెట్టి ఏకగ్రీవాల శాతంపై ఆకాంక్షలు వ్యక్తం చేస్తే ఎన్నికల నిష్పాక్షికతపై సందేహాలు కలగడం సహజం.

మున్సిపల్ చైర్మన్ మారెళ్ల రామాంజనేయులుకు ఘన సత్కారం

సత్తెనపల్లి: సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైన మారెళ్ల రామాంజనేయులును బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్, వాసవి మణికంఠ క్లబ్ సభ్యులు వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అతి చిన్న వయసులోనే మున్సిపల్ చైర్మన్గా ఎన్నికై బాధ్యతలు చేపట్టనున్న మారెళ్ల రామాంజనేయులును శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సత్తెనపల్లి పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బెల్లంకొండ నాగ సాయిప్రసాద్, వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు కొప్పరావూరి కాశీ వెంకట సుబ్బారావు, కార్యదర్శి



సూరె శ్రీనివాసరావు, కోశాధికారి దేవరపల్లి కాశీ విశ్వేశ్వరరావు, సూరె సుబ్బారావు, మై పైసా చిట్ఫండ్ కంపెనీ మేనేజర్ భాను తదితరులు, వాసవి మణికంఠ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




ఎస్టీయు ఆధ్వర్యంలో ఘన సన్మానం

సత్తెనపల్లి : ఇటీవల జరిగిన సత్తెనపల్లి పురపాలక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున మున్సిపల్ చైర్మన్గా గెలుపొందిన మారెళ్ల రామాంజనేయులును ఎస్టీయు సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండల అధ్యక్షులు పి. వెంకయ్య మాట్లాడుతూ.. మారెళ్ల రామాంజనేయులు మంచి మనసున్న వ్యక్తి అని, ఇతరులకు సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. చిన్నప్పటి నుంచి కష్టపడి ఈ స్థాయికి ఎదిగారని, భవిష్యత్తులోనూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్టీయు మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కె. సుభాని, రాష్ట్ర నాయకులు ఎస్.ఎం. సుభాని, ఎఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, ఎస్టీయు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కే. సురేష్, అసోసియేట్ అధ్యక్షులు వి. నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎం. రెహమాన్, అలాగే మండల నాయకులు ఏ. సుధీర్ పీటర్ పాల్, పి. సత్యనారాయణ రాజు, కె. సీతారామయ్య, ఎస్.కె. అఫ్రోజ్ మాలిక్, ఎస్.కె. నూరుద్దీన్, ఎస్.ఎ. బషీర్, జి. సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు- వారి భవిష్యత్తే దేశ భవిష్యత్తు

క్రోసూరు : బాలల హక్కులను గౌరవిస్తూ, వారి చిరునవ్వుల్లో దేశ భవిష్యత్తును చూద్దామని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పిలుపునిచ్చారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు మరియు ప్రేమతో కూడిన బాల్యాన్ని అందించడం ప్రజలందరి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా క్రోసూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుగ్గి బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శిఖా శాంసన్ బాలబాలికలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బిడ్డకు జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు ఉన్నాయని వివరించారు. బాలల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు సమాజం కూడా కీలక పాత్ర పోషించాలని సూచించారు. అంతకుముందు అతిథులు, ఉపాధ్యాయులు చాచా నెహ్రూ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయిని తులసి సౌజన్య బాలల దినోత్సవ ప్రత్యేక గేయాన్ని ఆలపించారు.



అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య, కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలిచ్చిన బాలికలకు ప్రధానోపాధ్యాయులు దుగ్గి బాబురావు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు. చివరగా విద్యార్థులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, నాగరాజు, నరసింహారావు, రాంబాబు, స్వరాజ్యం తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఓట్ల మెజారిటీతో గెలిచా: కౌన్సిలర్ తోట అంబిక



సత్తెనపల్లి: సత్తెనపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగానే జరిగిందని, ఓటమిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని 7వ వార్డు కౌన్సిలర్ తోట అంబిక స్పష్టం చేశారు. కౌంటింగ్పై వస్తున్న ఆరోపణలపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె పూర్తి వివరణ ఇచ్చారు. కౌంటింగ్ సమయంలో వివాదాస్పదంగా పక్కన పెట్టిన 27 ఓట్లలో 18 ఓట్లు తమ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, 4 ఓట్లు నోటాకు, 6 ఓట్లు మాత్రమే ప్రతిపక్షానికి చెందినవని ఆమె వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే, వాటిని వక్రీకరిస్తూ ప్రతిపక్ష నాయకులు ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని విమర్శించారు. అధికార పార్టీ నిజంగానే అధికార దుర్వినియోగానికి పాల్పడి ఉంటే మున్సిపాలిటీలో వైసీపీ అభ్యర్థులు ఎనిమిది వార్డుల్లో ఎలా విజయం సాధిస్తారని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో), గెజిటెడ్ అధికారులు, ఇరు పార్టీల కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలోనే ఓట్ల లెక్కింపు జరిగిందని తోట అంబిక వివరించారు. వైసీపీ కౌంటింగ్ ఏజెంట్ సైతం లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగినట్లు అంగీకరించారని పేర్కొన్నారు. వివాదాస్పదంగా మారిన 27 ఓట్లను అధికారులు రెండు, మూడు సార్లు క్షుణ్ణంగా పరిశీలించి, అందరి సమక్షంలోనే తుది నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అనంతరం తనకు రెండు ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ధ్రువీకరణ పత్రం అందజేశారని ఆమె స్పష్టం చేశారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

నరసరావుపేట రూరల్: ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి తెలిపారు. పంచాయతీ మొదటి దశ, నరసరావుపేట మున్సిపాలిటి ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రోహిత్కుమార్ చౌదరి, డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

పచ్చని అడవికి 'గ్రావెల్' గాయం

రాజుపాలెం : మండలం పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన అటవీ ప్రాంతం అక్రమార్కుల కన్నుపడింది. భవిష్యత్ తరాలకు అందించాల్సిన అటవీ సంపద, ప్రకృతి వనరులు అక్రమార్కుల జేబులు నింపుతున్నాయి. రాజుపాలెం మండలం బీరవల్లిపాయ అటవీ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా సాగుతున్న అక్రమ తవ్వకాల గుట్టును విజిలెన్స్/ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రట్టు చేశారు.

అసలేం జరిగింది?

బీరవల్లిపాయ అటవీ పరిధిలో కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా భారీ యంత్రాలతో తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అటవీ భూమిని కొల్లగొడుతూ మట్టి, గ్రావెల్ను తరలిస్తున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తవ్వకాలకు ఉపయోగిస్తున్న ఒక భారీ పొక్లెయిన్తో పాటు, అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల మెరుపు దాడితో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి.

అధికారుల నిఘా ఏమైంది?

అటవీ భూముల్లోకి భారీ యంత్రాలు, టిప్పర్లు వెళ్లి తవ్వకాలు





జరుపుతుంటే స్థానిక రెవెన్యూ, అటవీ శాఖల అధికారులకు తెలియకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు ప్రారంభమైనప్పటి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలో తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భూగర్భ జలాలు, వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూత్రధారులెవరు?

ప్రస్తుతం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అయితే, ఈ తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరు? ఎవరి అండదండలతో అటవీ భూముల్లోకి యంత్రాలు దిగాయి? ఇప్పటివరకు ఎంత మేర అటవీ సంపదను తరలించారు? అనే కోణంలో లోతైన విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం వాహనాలను సీజ్ చేసి చేతులు దులుపుకోకుండా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అటవీ భూముల రక్షణకు శాశ్వత నిఘా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు.

నిమోనియా నివారణ బాల్యానికి భరోసా

వైద్య అధికారి మేరీ శ్రీకళ, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



క్రోసూరు : క్రోసూరు మండలంఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ వల్ల కలిగే తీవ్రమైన శ్వాసకోశ వ్యాధి నిమోనియా అని దొడ్లేరు పీహెచ్సీ వైద్యాధికారిణి మేరీ శ్రీకళ తెలిపారు. ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా గురువారం క్రోసూరు మండలం పెరికిపాడు తండా ఎలిమెంటరీ స్కూలులో నిమోనియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ నిమోనియాపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇది ఊపిరితిత్తులకు వచ్చే అంటువ్యాధి అని, దీనివల్ల గాలి పీల్చుకోవడం కష్టమవడంతో పాటు ఆక్సిజన్ మోతాదు తగ్గుతుందని తెలిపారు. గాలి గదుల్లో వాపు ఏర్పడి ఊపిరి ఆడకపోవడం, దగ్గు, జ్వరం, ఊపిరితిత్తులలో నొప్పి, చలి, అలసట వంటి లక్షణాలుంటాయని వివరించారు. చిన్నారులు, వృద్ధులలో ఇమ్యూనిటీ తక్కువగా ఉండటం వల్ల వారికి ఇది త్వరగా సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎక్స్-రే, రక్త పరీక్ష, కఫ పరీక్ష, ఛాతి సీటీ స్కాన్, బ్రాంకోస్కోపి పరీక్షల ద్వారా దీన్ని నిర్ధారించవచ్చని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ, పిల్లలకు చిన్నతనంలో ఇచ్చే బీసీజీ, పెర్టుసిస్, నిమోకోకల్ వ్యాక్సిన్ల ద్వారా నిమోనియాను నివారించవచ్చని చెప్పారు. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వడం, చక్కని శుభ్రత పాటించడం చాలా ముఖ్యమన్నారు. పొగాకుకు దూరంగా ఉండాలని, ఆల్కహాల్, స్మోకింగ్ అలవాట్లు ఉంటే వెంటనే మానేయాలని సూచించారు. రోజూ వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ టీచర్లు మాలావతు మాధవీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన స్వాములను కలిసిన డాక్టర్ గజ్జల



నరసరావుపేట ప్రతినిధి : అయ్యప్ప మాల ధరించి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన వైయస్సార్సీపి మీడియా ప్యానలిస్ట్, చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు విజయ భాస్కర్ రెడ్డిని సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి కలిశారు. సత్తెనపల్లి పట్టణంలోని శబరి హైట్స్ అపార్ట్మెంట్ వద్ద నిర్వహించిన పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డితో పాటు పాదయాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములను కలిసి, వారి యాత్ర నిర్విఘ్నంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెపోరులోనూ అదే కుట్ర

టాస్క్ఫోర్స్: చిలకలూరిపేట నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో పల్లెల్లో రాజకీయ వేడి మొదలైంది. దీనికంటే ముందే బెదిరింపులు, ఒత్తిళ్లు, ఏకగ్రీవాలకు కుట్రకు కూటమి సర్కార్ తెగబడుతుందనే అందోళన నెలకొంది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలనే ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లోనూ అమలు చేసేందుకు అధికార కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ నాయకులు ఏకగ్రీవాలు చేసేందుకు గత ఎన్నికల మాదిరిగానే వ్యవహరించాలని, తమ వల్ల కాకపోతే పోలీసుల సాయం తీసుకోవాలని నియోజకవర్గ ప్రజాప్రతినిధి హుకుం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతిపక్షం బలపరిచిన అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటామని, కాదని నామినేషన్లు వేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం, పరిశీలన దశలో నామపత్రాలు తిరస్కరింపజేస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఆధిపత్యం ఉంటుందన్న భయంతోనే ప్రత్యర్థులను ముందుగానే పోటీకి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో 52 గ్రామ పంచాయతీలు, 534 వార్డులు, అన్నే పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మూడు మండలాల్లో మొత్తం 1,19,116 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 57,643 మంది పురుషులు, 61,471 మంది మహిళలు, మరో ఇద్దరు ఇతరులు ఉన్నారు. ఇందులో చిలకలూరిపేట మండలంలో 20 సర్పంచ్ స్థానాలు, 192 వార్డు సభ్యుల స్థానాలు, నాదెండ్ల మండలంలో 14 సర్పంచ్ స్థానాలు, 152 వార్డు సభ్యుల స్థానాలు, యడ్లపాడు మండలంలో 18 సర్పంచ్ స్థానాలు, 190 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు భద్రత కల్పించడం, నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు ప్రతి దశను నిష్పక్షపాతంగా నిర్వహించడం ఎన్నికల యంత్రాంగం ప్రధాన కర్తవ్యం. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పునాదులైన పంచాయతీ ఎన్నికలు ఎలాంటి వివాదాలకు తావులేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులది. అయితే, ఈసారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోటీ బరిలో నిలుస్తారా? ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటారా? అనేది పల్లెల్లో ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో ఇదే చర్చ సాగుతోంది. ప్రతిపక్ష అభ్యర్థి పేరు ఖరారు కాగానే వారిపై ఒత్తిళ్లు, వేధింపులకు పాల్ప డ్డారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, ఎదిరిస్తే ప్రత్యర్థ లపై దాడులు చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల అధికారుల ముందే అభ్యర్థుల నుంచి నామపత్రాలు లాక్కొని చింపివేశారు. నామినేషన్లు వేస్తే వారిని ఎత్తుకెళ్లి బలవంతంగా ఉపసంహరణలు చేయించారు. పోలింగ్ రోజున ప్రతిపక్ష పార్టీ ఏజెంట్లను కూర్చోనీయకుండా భయపెట్టారు. వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులను పోలింగ్ రోజున పోలీసుల చేత నిర్బంధించడం, సైక్లింగ్ పద్ధతిలో పోలింగ

ఎన్నికల హామీ నెరవేర్చిన కన్నా

50 ఏళ్ల నీటి కష్టాలకు చెక్



సత్తెనపల్లి: మాజీ మంత్రివర్యులు, సత్తెనపల్లి శాసనసభ సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు 7వ వార్డు పరిధిలోని చెరువు ప్రాంతంలో నివసిస్తున్న 15 కుటుంబాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎన్నికల హామీల్లో భాగంగా పల్నాడు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు ధరువురి నాగేశ్వరరావు నేతృత్వంలో, సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ మారెళ్ల రామాంజనేయులు, 7వ వార్డు కౌన్సిలర్ తోట అంబిక కలిసి ఆ ప్రాంతంలో నూతన మున్సిపల్ బోర్ మరియు ఉచిత మున్సిపల్ ట్యాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా తాము తీవ్ర నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి బోరింగ్, ట్యాప్ ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు, ధరువురి నాగేశ్వరరావుకు, మున్సిపల్ చైర్మన్ మారెళ్ల రామాంజనేయులుకు, 7వ వార్డు కౌన్సిలర్ తోట అంబికకు జీవితాంతం రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు హరికృష్ణ, మల్లేశ్వరరావు, మోహన్, విజయలక్ష్మి, బాజీ తదితర టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ధరల నియంత్రణపై జాయింట్ కలెక్టర్ సమీక్ష



నరసరావుపేట : పల్నాడు జిల్లా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంతో పాటు వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో కలెక్టరేట్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సంజన శ్రీహర్ష అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బియ్యం బస్తాల విక్రయాలు, తూకాల్లో పారదర్శకత, ప్రభుత్వ ధరల అమలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో విక్రయించే బియ్యం బస్తాలపై ఖచ్చితమైన బరువు, తయారీ తేదీ, ఇన్వాయిస్ వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని స్పష్టం చేశారు. బస్తాలపై పేర్కొన్న బరువుకు, వాస్తవ బరువుకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదని, వాస్తవ తూకానికి అనుగుణంగా స్టిక్కర్లను ఏర్పాటు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర వస్తువులను విక్రయించాలని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైస్ మిల్లర్లు, లీగల్ మెట్రాలజీ అధికారుల మధ్య నెలకొన్న సమస్యలపై చర్చించి, ఇరువర్గాల మధ్య పరస్పర అవగాహన కుదిర్చారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రణవి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి రూరల్ మండలం, కట్టావారిపాలెం గ్రామంలో నిర్వహించిన చిన్నారి ప్రణవి జన్మదిన వేడుకలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి చిన్నారి ప్రణవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పాప ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

బారసాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు



బాపట్ల: బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ మరియు బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీ అధ్యక్షులు ముప్పానేని శ్రీనివాసరావు మనవడి బారసాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. అనంతరం ముప్పానేని శ్రీనివాసరావు మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సన్నిహితులు పాల్గొన్నారు.

న్యాయ నేత్రం

పోలీసు స్టేషన్ నుండి మీకు ఫోన్ కాల్ వచ్చిందా...



మీకు సడన్‌గా పోలీసు స్టేషన్ నుండి ఫోన్ కాల్ వస్తే కంగారు పడమాకండి. వెంటనే మీకు నమ్మకమైన వ్యక్తులను తోడుగా తీసుకు వెళ్లిండీ. వంటరిగా ఎప్పుడు వెళ్లకండి. ఇంకా ముఖ్యముగా ఒక లాయర్ గారిని తీసుకువెళ్లటం చాలా మంచిది. ఒక వేళ కేసు రిజిస్టర్ ఐతే లాయర్ గారికి కేసు మీద మంచి పట్టు దొరుకుతుంది. ముందుగా పోలీసులు పిలిచిన వెంటనే వెళ్లడం మనకు గౌరవం. భయ పడకుండా కేసు గురించి అడగండి.ఆ కేసు ఎవరూ పెట్టారు, ఎప్పుడు పెట్టారు, ఎందుకు పెట్టారు వివరంగా అడుగండి, పోలీసు వారు అడిగిన ప్రశ్నలకు సావధానముగా జవాబు ఇవ్వండి.పోలీసు వారు మీరు రాజీ పడటానికి మనకు అవకాశం ఇస్తారు. స్త్రీలు పోలీసులు పిలిచిన వెంటనే వెళ్లాల్సిన అవసరం లేదు. సూర్యోదయము మొదలు సూర్య అస్తమయం వరకు వెళ్లాల్సి ఉంటుంది. చీకటి పడితే పోలీసు స్టేషన్ వెళ్లాల్సిన పని లేదు. తెల్లవారిన తరువాత వెళ్ల వచ్చు. మీరు మా లాయర్ గారి తో వస్తాము అంటే పోలీసు వారు మీకు అనుమతి ఇస్తారు. అది రాజ్యాంగం మీకు ఇచ్చిన హక్కు. ప్రతి ముద్దాయి లాయర్ ని కలిసి సలహాలు తీసుకువచ్చు. కావున ఎవరైన పోలీసులు పిలిచిన వెంటనే ఒక లాయర్ ని తోడు గా తీసుకు వెళ్లడం చాలా మంచిది. ఇలాంటి పరిస్థితుల్లో లాయర్ సలహాలు తీసుకోవటం చాలా ఉత్తమము.


షేక్ జానీ ఖాజావలి, న్యాయవాది, M.Com, LL.B., **9441085206**

ఉల్లం పలుకు :



అజ్ఞానానికి అవివేకానికి అహంకారానికి
అధికారం ఇస్తే దాడిచేసి ప్రజ్ఞను
పాతేస్తుంది మేధస్సును ముంచేస్తోంది
ప్రజాస్వామ్యానికిప్రమాదఘంటికలు
మోగిస్తుంది ఓటరు మహాశయులారా
పోరాడకపోయిన పర్వాలేదు
అమ్ముడుపోకండి!"

- ఉల్లం శేషగిరిరావు అడ్వకేట్, హైకోర్టు & సామాజిక విశ్లేషకులు



7వ వార్డు కౌంటింగ్‌పై వివాదం

రీకౌంటింగ్‌కు వైఎస్సార్‌సీపీ డిమాండ్, రీ-ఎలక్షన్‌కైనా సిద్ధమన్న టీడీపీ



సత్తెనపల్లి ప్రతినిధి : పల్నాడు జిల్లా సత్తెనపల్లి మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రాజకీయ వివాదం నెలకొంది. కౌంటింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, రీకౌంటింగ్ నిర్వహించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రెస్ నోట్ ద్వారా తెలిపారు. మరోవైపు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చేసిన ఆరోపణలు, ఫిర్యాదుపై టీడీపీ అభ్యర్థి స్పందించారు. తాము కేవలం రీకౌంటింగ్‌కే కాకుండా, అవసరమైతే రీ-ఎలక్షన్‌కు కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేసినట్లు స్థానిక వర్గాల సమాచారం. ప్రస్తుతం సత్తెనపల్లి 7వ వార్డు కౌంటింగ్ వ్యవహారం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అందించిన ఫిర్యాదును పరిశీలించిన తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ అంశంపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హౌస్ అరెస్ట



నరసరావుపేట : పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందుజాగ్రత్తగా పోలీసులు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వార తెలిపారు.

చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి మండల పరిధిలోని ధూళిపాల గ్రామం వద్ద శంకర్ నేత్రాలయం సంయుక్త కార్యక్రమంలో రాజాగారి కోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రి సముదాయంలో, డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్ మరియు శంకర నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి పలు ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వైద్య బృందం రోగులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు మరియు కళ్లద్దాలను పంపిణీ చేసింది. ఈ సేవా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కోడెల శివరామ్ ముఖ్య అతిథిగా పాల్గొని, శిబిర ఏర్పాట్లను పరిశీలించి రోగులతో మాట్లాడారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ట్రస్ట్ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావు



శబరిమలై పాదయాత్ర బృందాన్ని కలిసిన మాజీ మంత్రి విడదల రజిని





చిలకలూరిపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీడియా ప్యానలిస్ట్, చిలకలూరిపేట నియోజకవర్గ పరిశీలకులు చిట్టా విజయ భాస్కర రెడ్డి అయ్యప్ప స్వామి మాల ధరించి సత్తెనపల్లి నుంచి శబరిమలైకి పాదయాత్ర ప్రారంభించారు. ఈ క్రమంలో పాదయాత్రలో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్ల గ్రామానికి చేరుకున్న ఆయన, తనతో పాటు ఉన్న పాదయాత్ర బృంద సభ్యుల తో కలిసి అక్కడి శివాలయంలో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని లింగంగుంట్ల గ్రామంలోని శివాలయానికి చేరుకుని చిట్టా విజయభాస్కర రెడ్డిని, పాదయాత్ర బృంద సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడి పాదయాత్ర ప్రారంభం, ప్రయాణ మార్గం, యాత్ర విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయ్యప్ప స్వామి పట్ల భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ పవిత్ర పాదయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగి, విజయ వంతం గా పూర్తికావాలని విడదల రజిని ఆకాంక్షించారు. అయ్యప్ప స్వామి వారి కృపాకటాక్షాలు చిట్టా విజయభాస్కర రెడ్డితో పాటు పాద యాత్ర బృంద సభ్యులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, వారందరికీ స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరుకుంటూ శు భాకాంక్షలు తెలియజేశారు.

చిన్నారి పుట్టినరోజు వేళ దాతృత్వం: కేజీబీవీ విద్యార్థులకు చలికోట్ల పంపిణీ





ముప్పాళ్ళ : ముప్పాళ్ళ మండలం, గొల్లపాడులోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నందు 'హెల్ప్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు చలికోట్లను పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలం, కంభంపాడు గ్రామానికి చెందిన నలగొండ శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతుల కుమార్తె హరిప్రియ పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందుగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ సుహారలత మాట్లాడుతూ, దాతలు అందిస్తున్న సహాయాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మంచి నడవడిక, విద్యాబుద్ధులు అలవర్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ, "నీ చదువు, నీ ఆత్మవిశ్వాసమే నీకు అసలైన బలం. కాబట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి బాగా చదువుకోవాలి" అని విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఫౌండేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు మాలెంపాటి సౌజన్య మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయసు నుంచే నిజాయితీ, క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ రాంబాబుపై చర్యలు తీసుకోవాలి



సత్తెనపల్లి రూరల్ : వైసీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారంటూ సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల తీరుపై పలు ఆరోపణలు చేశారు.

అక్రమ కేసులు, వేధింపులు: సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామ ఎంపీటీసీ స్థానాన్ని వైసీపీ గెలుచుకున్న నేపథ్యంలో, ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఒక దుకాణంపై అనుచిత వ్యాఖ్యలతో పోస్టర్లు అంటించారని ఆయన తెలిపారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, దుకాణ యజమాని ఎవరి పేర్లూ చెప్పకపోయినా రూరల్ సీఐ తమ పార్టీ సానుభూతిపరులను స్టేషన్‌కు తీసుకెళ్లి వేధించారని, అక్రమ కేసుల్లో ఇరికించారని డాక్టర్ గజ్జల ఆరోపించారు.

పక్షపాత వైఖరి ఆరోపణ: సీఐ రాంబాబు ఖాకీ దుస్తులకు బదులు ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, గత ఎన్నికల్లోనూ తమ పార్టీ ఏజెంట్లు, అభ్యర్థులను బెదిరించారని ఆయన విమర్శించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరగాలంటే ఆయన్ను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కోరారు.

లీగల్ టీం పట్ల దురుసు ప్రవర్తన: ఈ కేసు విషయమై సీఐని కలిసేందుకు వెళ్లిన 30 ఏళ్ల అనుభవం ఉన్న తమ పార్టీ లీగల్ టీం సభ్యుల పట్ల ఆయన దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడారని ఆరోపించారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు: ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను ఇప్పటికే జిల్లా ఎస్పీ, డీఎస్పీలకు అందజేశామని డాక్టర్ గజ్జల వెల్లడించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సీఐ రాంబాబును సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు పైవేటు కేసులు దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ లీగల్ టీం సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ మరియు వార్డు స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

సత్తెనపల్లి: భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పెద్దింటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చాచా నెహ్రూకు గులాబీలన్న, చిన్నారులన్న ఎంతో ప్రీతి కనుక ఆయన జీవిత విశేషాలపై విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ లయన్ వి.వి. కృష్ణమాచార్యులు, ఎంజీఎఫ్ లయన్ కోట వెంకటేశ్వర్లు, ఎంజీఎఫ్ లయన్ కంకణాల విష్ణువర్ధన్ రావు, డిస్ట్రిక్ట్ చైర్మన్లు గ్రంధిశిలా శ్రీనివాసరావు, పోత్తూరి రామకోటయ్య, తోట చిన్న సాంబశివయ్య, మంచకంటి వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ లయన్ కొప్పరావరి రాజశేఖర్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు లయన్ సభ్యులు రాయుడు అప్పారావు, కంభంపాటి నవీన్ కుమార్, గురు ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుస్సేన్ మరియు అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



గురుకుల పాఠశాలలో ఎలుకల కలకలం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని రామకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్. అంబే డ్కర్ గురుకుల పాఠశాలలో వరుస ఘటనలు చోటుచేసుకుంటుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తాజాగా పాఠశాల వసతి గృహంలో నిద్రిస్తున్న ఎనిమిది మంది విద్యార్థులపై ఎలుకలు దాడి చేసి గాయపరిచినట్లు సమాచారం. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యులు వారికి అవసరమైన చికిత్సను అందిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలతో ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులను, తాజాగా జరిగిన ఎలుకల దాడి ఘటన మరింత కలవరానికి గురిచేస్తోంది. గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రత, పారిశుధ్య నిర్వహణ లోపాలపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాఠశాల పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, విద్యార్థుల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

మాదలలో దారుణం..

కన్నతల్లి గొంతు కోసి హత్య చేసిన తనయులు!

ముప్పాళ్ళ: మద్యానికి బానిసలైన కుమారులు కన్నతల్లిపైనే కత్తితో దాడి చేసి అత్యంత కిరాతకంగా గొంతు కోసి హత్య చేసిన దారుణ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే...

మాదల గ్రామానికి చెందిన పాపాన రామయ్య కుమార్తె సీతారావమ్మకు వినుకొండ నియోజకవర్గం పరిధిలోని అడవిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తితో గతంలో వివాహమైంది. అయితే, ఆమె కుమారులు మద్యానికి పూర్తిగా బానిసలై నిత్యం తల్లిని నానా విధాలుగా హింసించేవారు. కుమారుల వేధింపులు, కష్టాలు భరించలేక సీతారావమ్మ నాలుగు రోజుల క్రితం తన పుట్టినిల్లయిన మాదల గ్రామానికి వచ్చి ఉంటోంది.

ఈ క్రమంలో ఆమె అచూకీ తెలుసుకున్న కుమారులు మాదల గ్రామానికి చేరుకున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి కత్తితో తల్లి గొంతు కోసి, అక్కడి నుంచి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న సీతారావమ్మను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ, రూరల్ సీఐ, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కన్నకొడుకులే తల్లిని కడతేర్చడంతో మాదల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీతాఫలంపైనా ఎల్ నినో ఎఫెక్ట్!

- పెరిగిన ఉష్ణోగ్రతలతో చెట్టుపైనే మాడిపోతున్న పిందెలు
- తగ్గనున్న దిగుబడి.. ధరలు పెరిగే అవకాశం



సీజనల్ ఫ్రూట్‌గా అందరికీ అందుబాటులో ఉండే సీతాఫలం.. ఈసారి సామాన్యులకు అందనంత దూరం వెళ్లున్నది. ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతలు సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పూత దశలోనే పిందెలు రాలిపోతున్నాయి. కాసిన కాయలు కూడా పూర్తిస్థాయిలో ఎదగడం లేదని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీతాఫలాల చెట్లు ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రం వీటికి పెట్టింది పేరు. జిల్లాలో గుట్టలు, బంజరుభూములు, అటవీ ప్రాంతాలు విస్తారంగా ఉండడమే ఇందుకు ప్రధానకారణం. బాలాపూర్ సీతాఫలానికి జీఐ ట్యాగ్ సైతం లభించింది.

ప్రతీ సీజన్‌లో సీతాఫలాల సేకరణతో పెద్దఎత్తున గ్రామీణ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు సీతాఫలం దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్టు ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా సీతాఫలాలు జూలై నుంచి ఆగస్టు మధ్య పూత పిందెగా మారి, సెప్టెంబర్ మొదటివారంకల్లా కాయలు పక్వానికి వస్తాయి. కానీ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు గతి తప్పాయి. రోజులతరబడి వానలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పిందెలు నిలువలేదు. సాధారణంగా ఒకో చెట్టుకు 50 నుంచి 60 కాయలు ఉండాలి. కానీ ప్రస్తుతం పదికి మించి కనిపించడం లేదు. వాస్తవంగా సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల సంఖ్య కూడా తగ్గుతున్నదని, దీనికి ఎల్ నినో తోడైనట్టు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గుట్టలు తొలగించడం, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సహజ సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు.

దిగుబడి తగ్గడంతో డిమాండ్ ఎక్కువై రేట్లు అమాంతం పెరిగాయి. నిరుడు ఒక్కో కాయ రూ. 5 నుంచి 10 వరకు విక్రయించారు. గంపల లెకన అయితే రూ.200 నుంచి రూ.250 వరకు అమ్మారు. గ్రామీణ ప్రాంతాలకంటే హైదరాబాద్ వంటి పట్టణాల్లో సీతాఫలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకొక సీతాఫలాన్ని నాణ్యత, బరువును బట్టి.. రూ. 30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. ఆశించిన స్థాయిలో సీతాఫలాల దిగుబడి కనిపించకపోవడంతో ఉపాధి సైతం తగ్గింది. పండ్లను సేకరించిన తర్వాత ప్రాసెసింగ్ చేసే మహిళాసంఘాల సభ్యులు సైతం పనులు లేక ఖాళీగా ఉన్నారు. నిరుడు ఇదే సమయానికి దాదాపు 60 శాతం వరకు సీతాఫలాల ప్రాసెసింగ్ నిర్వహించినవారికి ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక పండూ రాలేదంటే పరిస్థితి ఏరకంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

మధుమేహం ఉన్నా గుర్తించట్లే!

న్యూఢిల్లీ: మన దేశంలో 3.86 కోట్ల మంది వయోజనులు మధుమేహంతో బాధపడుతున్నప్పటికీ, ఆ విషయాన్ని గుర్తించడం లేదు. అంటే, ఈ వ్యాధితో బాధపడుతున్న 8.98 కోట్ల మందిలో 43 శాతం మంది వైద్య పరీక్షలు చేయించుకోకుండా గడుపుతున్నారు. ఈ నెల 14న మధుమేహ దినం సందర్భంగా అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య (ఐడీఎఫ్) విడుదల చేసిన తాజా సర్వే ఈ వివరాలను వెల్లడించింది. మన దేశంలో టైప్-2 డయాబెటిస్ ముప్పు ఎక్కువగా ఉన్నవారి వివరాలను విశ్లేషించినపుడు, ఈ వ్యాధి వల్ల జరిగే ముప్పును చాలా మంది తక్కువగా అంచనా వేస్తున్నట్లు తెలిసింది.

పరీక్షలను ఎలా చేయించుకోవాలో వీరికి తెలియడం లేదు. భారత్, బ్రెజిల్, కెన్యా, సౌదీ అరేబియా, స్పెయిన్, అమెరికాలలో ఈ సర్వేను నిర్వహించారు. మన దేశం నుంచి 502 మంది పాల్గొన్నారు. వీరు 25-64 ఏండ్ల మధ్య వయస్కులు. డయాబెటిస్ రిస్క్ చెక్ చేయించుకోవడం అవసరమేనని 84 శాతం మంది అంగీకరించగా, తమకు టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉందని 14 శాతం మంది మాత్రమే నమ్ముతున్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో ప్రతి ఒక్కరూ ముప్పునకు సంబంధించిన కనీసం రెండు లక్షణాలను చెప్పారు.

ప్రీ-డయాబెటిస్‌పై అపోహలు..

మధుమేహానికి ముందు దశ అయిన ప్రీ-డయాబెటిస్‌పై ప్రజల్లో అపోహలు ఉన్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. ఈ దశలో రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, మధుమేహం నిర్ధారణ అయ్యేంత స్థాయికి చేరవు. ఈ ఆరు దేశాల నుంచి పాల్గొన్న వారిలో 75 శాతం మంది ప్రీ-డయాబెటిస్ ఉన్న వారిలో గమనించదగిన లక్షణాలు పైకి స్పష్టంగా కనిపిస్తాయని నమ్ముతున్నారు.

ఇది చాలా తప్పుడు భావన. డయాబెటిస్ రిస్క్ చెక్ కోసం ఏర్పాట్లు చేసుకునే ఆత్మవిశ్వాసం లేదని 48 శాతం మంది చెప్పగా, చెక్ చేయించుకుంటే ఎలాంటి ఫలితాలు వస్తాయోనని భయపడుతున్నామని 35 శాతం మంది తెలిపారు. తమకు మధుమేహం ముప్పు లేదని 25 శాతం మంది భావిస్తున్నారు.

భయాందోళనలు తొలగించాలి..

ఐడీఎఫ్ ఆగ్నేయాసియా ప్రాంత చీఫ్ డాక్టర్ బన్ని సబూ మాట్లాడుతూ, ప్రజలే ముందుకు వచ్చి మధుమేహ పరీక్షలు చేయించుకునే వరకు భారతదేశం ఎదురు చూడకూడదని చెప్పారు.



మధుమేహం ప్రమాదం ఉన్నవారు పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రావాలంటే, భయాందోళనలను తొలగించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఐడీఎఫ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పీటర్ స్కార్బ్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సుమారు 25 కోట్ల మంది తమకు మధుమేహం ఉన్న విషయం తెలియకుండానే జీవిస్తున్నారన్నారు. వ్యాధిపై అవగాహన ఉండటానికి, వ్యక్తిగతంగా తమకు ఉన్న ప్రమాదాన్ని గుర్తించడానికి మధ్య వ్యత్యాసం ఉందన్నారు.

నెమ్మదిగా ...

టైప్-2 మధుమేహం లక్షణాలు చాలా నెమ్మదిగా అభివృద్ధి చెందుతాయి. కొన్నేండ్లపాటు కొనసాగినా, వాటి తీవ్రత తక్కువగా ఉండటంతో చాలా మంది ఆ విషయాన్ని గుర్తించలేకపోవచ్చు. అందుకే వ్యాధి ముదిరిన తర్వాతే నిర్ధారణ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఐడీఎఫ్ డయాబెటిస్ అట్లాస్ 11వ ఎడిషన్ ఆధారంగా రూపొందించిన గణాంకాల ప్రకారం, మన దేశంలో మధుమేహం ఉన్న వయోజనుల్లో ప్రస్తుతం 57 శాతం మందికి వ్యాధి నిర్ధారణ జరిగింది.

దీనిని 2030 నాటికి 80 శాతానికి పెంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశంలో మరో 2.07 కోట్ల మందికి మధుమేహాన్ని నిర్ధారించాలి. అంటే 2030 చివరి వరకు రోజుకు సుమారు 13,700 మందికి వ్యాధి నిర్ధారణ జరగాల్సి ఉంటుంది. దేశంలో మధుమేహ వైద్య ఖర్చులు 2024లో 980 కోట్ల డాలర్లకు చేరాయి. గుండెపోటు, పక్షవాతం, చూపు కోల్పోవడం, కాళ్లను తొలగించవలసి రావడం వంటి సమస్యలకు చికిత్స చేయడానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తున్నది.

పానీపూరిఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టిందో...

పానీపూరి పుట్టుక గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో అత్యంత ఆసక్తికరమైనది... మహాభారత కాలానికి చెందినది. పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్న కాలంలో... కోడలు ద్రౌపది తెలివితేటలను రకరకాలుగా పరీక్షించేవారట కుంతీ.

ఆ పరీక్షలలో ఒకటి... బంగాళదుంప కూరలో మిగిలిన భాగాన్ని, గోధుమ పిండితో చేసిన చిన్న ముద్దను ఇచ్చి... 'వీటితోనే అయిదుగురు అన్నదమ్ముల ఆకలి తీర్చు' అని చెప్పిందట. ఈ నేపథ్యంలో ఒక సృజనాత్మక మార్గాన్ని కనిపెట్టింది ద్రౌపది. తనకు ఇచ్చిన తక్కువ పిండితో చపాతి చేయడానికి బదులుగా, చిన్న చిన్న భాగాలు చేసింది. పిండి ముక్కలను గుల్లగా మారేలా వేయించి, వాటిలో బంగాళదుంప మిశ్రమాన్ని నింపింది. అదే... పానీపూరి తొలిరూపం!



కోడలి సృజనాత్మకతను చూసి కుంతి ముగ్ధురాలైందట. ఆ సంతోషంలో కోడలు తయారుచేసిన వంటకానికి అమరత్వం ప్రసాదించిందట! ఆ వరం వల్లే 'పానీపూరి'గా బాగా పాపులర్ అయిందట. బిహార్‌లోని ప్రాచీన మగధ ప్రాంతంలో 'పానీపురి' పుట్టిందని మరో కథనం.



'సర్'లో ఓటు కోల్పోతే ఫామ్-6తో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో పేర్లు తొలగించబడినవారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈసీ ఈ విషయం వెల్లడించింది. తాము చిరునామా మారడంతో గణన ప్రక్రియలో పాల్గొనలేకపోయామని, అందువల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించాలనే నిబంధనకు బదులుగా, పాత పేర్లను పునరుద్ధరించేందుకు ఫామ్-8 ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. అయితే, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం ఫామ్-6ని సమర్పించి, సమస్యను పరిష్కరించుకోవచ్చని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఎన్నికల నమోదు అధికారి కూడా అవసరమైన సహాయం అందిస్తారని తెలిపారు.

భారత నౌకలకు ప్రత్యేక గుర్తులు



భారతీయ ప్రభుత్వ, ప్రైవేటు నౌకలను గుర్తించేందుకు వాటిపై ప్రత్యేక గుర్తులు ముద్రించాలని కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ నౌకలకు నీలం రంగు నేపథ్యంలో భారత పతాకాన్ని (బ్లూ ఎన్‌సైన్), మర్చంట్ షిప్పింగ్ యాక్ట్-2025 కింద రిజిస్టరైన ఇతర నౌకలకు ఎర్ర రంగులో భారత పతాకాన్ని (రెడ్ ఎన్‌సైన్) ముద్రించాలని నిర్దేశిస్తూ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ప్రత్యేక గుర్తుల కేటగిరీ నుంచి భారత నౌకాదళం, తీరగస్తీ ఓడలను మినహాయించారు. నౌకలపై ముద్రించే ఈ ప్రత్యేక బ్యాడ్జిలకు కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి. మారిటైం అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ద్వారా దీనికోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ జారీకి ముందు ప్రభుత్వ ఆమోదంతో ఉపయోగిస్తున్న బ్యాడ్జిలను అలాగే కొనసాగించవచ్చు.



నటీనటులు: అనీష్, అనస్వర రాజన్, వెన్నెల కిశోర్, ముఖేష్ రుషి, బ్రహ్మాజీ తదితరులు, సంగీతం: తమన్, నిర్మాణం: వెంకీ కుడుముల, దర్శకత్వం: మహేష్ ఉప్పల, సమర్పణ: అక్కినేని నాగార్జున, సంస్థ: వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్, విడుదల: 13-11-2026

రివ్యూ: ఇట్లు అర్జున

ఎన్టీఆర్, రామ్‌చరణ్, అఖిల్ తదితర ప్రముఖ తారలు ప్రచార కార్యక్రమాల్లో భాగం కావడంతో విడుదలకు ముందే అందరి దృష్టినీ ఆకర్షించింది... 'ఇట్లు అర్జున'. అగ్ర కథానాయకుడు నాగార్జున సమర్పకుడు కాగా, దర్శకుడు వెంకీ కుడుముల నిర్మించారు. మరి ఆ ప్రచారానికి తగ్గట్టుగా సినిమా ఉందో లేదో తెలుసుకుందాం..

కథేంటంటే..

అర్జున్ (అనీష్) మాటలు రాని తెలివైన యువకుడు. చిన్నప్పట్నుంచీ దొంగతనాలకు పాల్పడుతుంటాడు. పోలీసుల రికార్డుల్లోకీ చేరతాడు. బాల్యం నుంచే తన ఇంటి పైనున్న కీర్తి (అనస్వర)ని ప్రేమిస్తుంటాడు. ఎప్పటికైనా ఆమెని దగ్గర్నుంచి చూసి.. కరచాలనం చేయాలనీ, తన మనసులోని ప్రేమని చెప్పాలని ఆశ. పద్ధతిగా పెరిగిన కీర్తికేమో ఇల్లే ప్రపంచం. స్వేచ్ఛగా, సంతోషంగా తనకు నచ్చినట్టుగా గడపాలని ఉంటుంది. కానీ, తల్లి పద్ధతి పేరుతో కట్టడి చేస్తుంటుంది. అయితే అనుకోకుండా తల్లి దిల్లీకి వెళ్లడంతో కీర్తి స్వేచ్ఛ లభిస్తుంది. కొత్త ఏడాది సంబరాల కోసం పబ్‌కి వెళుతుంది. అక్కడ తన బావ కిశోర్ (వెన్నెల కిశోర్) కంట పడకుండా ఇంటికొచ్చే క్రమంలో అర్జున్‌ని కలుస్తుంది. ఆ తర్వాత ఊహించని రీతిలో వెయ్యి కోట్ల రూపాయల హవాలా డబ్బుతో ముడిపడిన ఓ వ్యవహారంలో ఇరుక్కుంటారు. పెద్దన్న (ముఖేష్ రుషి) ముఠాకీ, పోలీస్ అధికారి ఇరానీ (ఎలాంగో కుమరవేల్)కి టార్గెట్‌గా మారతారు. అసలు ఆ డబ్బు వెనక కథేమిటి? వీళ్లే ఆ వ్యవహారంలో ఇరుక్కోవడానికి కారణమేమిటి? దాన్నుంచి ఎలా బయట పడ్డారు? అర్జున్ తన మనసులోని ప్రేమని కీర్తి ముందు వ్యక్తం చేశాడా? ఆమె తిరిగి ప్రేమించిందా లేదా? అనేది మిగతా కథ.

ఎలా ఉందంటే.. చిత్రసీమలో కథానాయకుడి పరిచయ సినిమా అంటే కొన్ని లెక్కలుంటాయి. కథ కంటే కూడా ఆ కథానాయకుడి ప్రతిభనంతా వెలుగులోకి తీసుకొచ్చి... కుర్రాడు బాగా చేశాడు అనిపించాలనే ప్రయత్నాలే ఎక్కువగా కనిపిస్తాయి. అది ఓ మంచి వ్యూహం కూడా! అనీష్ విషయంలోనూ అదే జరిగింది. డ్యాన్సులు, ఫైట్స్‌లో ప్రతిభని, ఆయనలోని సునాయాసమైన నటుడిని పక్కాగా ఆవిష్కరించేలా పాత్రని మలిచారు. వీటన్నిటితోపాటు ఓ సాహసోపేతమైన ప్రయత్నం కూడా కనిపించింది. అది కథానాయకుడి పాత్రకి మాటలు లేకపోవడం. తొలి సినిమా హీరో కోసం ఇలాంటి పాత్రని డిజైన్ చేయడం, హీరో కూడా ఆ పాత్రని నమ్మి ధైర్యంగా భుజానికెత్తుకోవడం నిజంగా ఓ సాహసమే. ఏ చిన్న తప్పు జరిగినా ఆ ప్రభావం సినిమాపై బలంగా పడే ప్రమాదం ఉంటుంది. కానీ, కథానాయకుడిలోని ఆ బలహీనతని కథకు తెలివిగా ముడిపెడుతూ సన్నివేశాల్ని మలిచిన తీరు ఈ సినిమాని ప్రత్యేకంగా మార్చేసింది.

తన కొడుకు భవిష్యత్తుకు అడ్డొచ్చే వారి ప్రాణాలు తీసే పెద్దన్న, అతని ముఠా, రూ. వెయ్యి కోట్ల హవాలా డబ్బు, అందుకు సంబంధించిన ఓ పెన్‌డ్రైవ్, నెల రోజులు మాత్రమే పనిచేసే పాస్‌వర్డ్,... ఇలా సినిమా ప్రారంభమే ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఆ తర్వాత హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమకథ మొదలవుతుంది. ఆ రెండు ట్రాక్‌లను దర్శకుడు సమాంతరంగా నడిపించిన విధానం బాగుంది. ప్రేమకథకి తోడుగా నాయకానాయికలు వెన్నెల కిశోర్‌తో కలిసి చేసే సందడితో సినిమా పరుగులు పెడుతుంది. ప్రధాన పాత్రల పరిచయం, కథానాయకుడి బాల్యం, విరామానికి ముందు వచ్చే సన్నివేశాలు, కథలోని అనూహ్యమైన మలుపులు, పాటలు ప్రథమార్ధం సినిమాకి ప్రధానబలం.

ద్వితీయార్ధం కూడా అదే పెన్‌డ్రైవ్, పాస్‌వర్డ్ టైమ్‌లైన్ చుట్టూనే సాగుతుంది తప్ప కథ పరంగా ప్రత్యేకమైన మెరుపులేమీ ఉండవు. కొన్ని మలుపులు మాత్రం థ్రిల్‌ని పంచుతాయి. ప్రేమకథలో భావోద్వేగాల మోతాదు కూడా పెరుగుతుంది. పోలీస్ అధికారి ఇరానీ పాత్రతో ముడిపడిన మలుపుతో పాటు, ప్రతినాయకుడి ఇంట్లోకి హీరో ప్రవేశించడం, హీరోయిన్ పాస్‌వర్డ్ కనుక్కునేలా చేయడం, హీరో తన ప్రేమని వ్యక్తం చేయకపోయినా తాను ప్రేమిస్తున్నదెవరో హీరోయిన్‌కి తెలిసే పతాక సన్నివేశాలు తెలివైన రచనకు అద్దం పడతాయి. కథ, నేపథ్యాలు కొత్తవేమీ కాకపోయినా వాటిని ట్రెండీగా, ఆసక్తికరమైన కథనంతో ఆవిష్కరించిన తీరు ప్రేక్షకుల్ని కట్టి పడేస్తుంది.

ఎవరెలా చేశారంటే..

కథానాయకుడు అనీష్ సహజమైన నటనతో ఆకట్టుకున్నాడు. మాటలు రాని యువకుడి పాత్రలో ప్రదర్శించిన హావభావాలు, పండించిన భావోద్వేగాలు... సునాయాసంగా చేసిన డాన్సులు, యాక్షన్ సన్నివేశాలు ఆయన ప్రతిభకు అద్దం పడతాయి. కథానాయిక అనస్వర రాజన్ నటన, ఆమె అందం ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. వెన్నెలకిశోర్, బ్రహ్మాజీ తదితరులు పంచారు. పెద్దన్నగా ముఖేష్ రుషి, గౌరి పాత్రలో కలైయరసన్, ఇరానీ పాత్రలో ఎలాంగో కుమరవేల్ కీలకంగా కనిపిస్తారు. వెన్నెలకిశోర్ పంచిన హాస్యం బాగుంటుంది. బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, రఘుబాబు ప్రాధాన్యమున్న పాత్రల్లో కనిపిస్తారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. తమన్ పాటలు, నేపథ్య సంగీతం, రాజ మహదేవన్ విజువల్స్ సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. వెంకీ కుడుముల నిర్మాణం ఉన్నతమైన ప్రమాణాలతో సాగింది. దర్శకుడు మహేశ్ ఉప్పల థ్రిల్, యాక్షన్ అంశాల్ని మేళవిస్తూ ప్రేమకథ నడిపించిన తీరు, మానస శర్మతో కలిసి ఆయన రాసుకున్న స్క్రీన్‌ప్లే, మాటలు మెప్పిస్తాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT GUNDEPUDI VARI VEEDHI, D.NO.18-6-12/4, ACHAMPET ROAD, SATTENAPALLI, PALNADU DISTRICT. ARUNDALPETA, 13TH LINE, 3RD CROSS ROAD, D.NO.31-13-1138, GUNTUR, A.P.- 522002. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.